వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 46 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-



## బ్లడ్ మూన్ కనువిందు

### భారత్‌లో ప్రారంభమైన సంపూర్ణ చంద్రగ్రహణం..!

- ఆదివారం రాత్రి 11 గంటలకు మొదలు
- టెలిస్కోప్‌ల ద్వారా ఆసక్తిగా వీక్షించిన ప్రజలు
- అవగాహన కల్పించిన నిపుణులు

న్యూఢిల్లీ -07 – ప్రజా స్వేచ్ఛ

ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రపంచవ్యాప్తంగా భారత్‌తో పాటు అనేక దేశాల్లో చంద్రగ్రహణం కనిపించింది. భారత్‌లో ఆదివారం రాత్రి 9.56 గంటలకు ఇది ప్రారంభమైంది. ఇక ఇదేరోజు రాత్రి 11 గంటలకు 'సంపూర్ణ చంద్రగ్రహణం' మొదలైంది. ఇది తర్వాతి రోజు (సోమవారం) ఉదయం 12.22 గంటలకు ఇదీ వీడనున్నది. అంటే 82

-మిగతా 3 లో



## 'ధైర్యముంటే అమెరికా వస్తువులపై 75 శాతం సుంకాలు విధించండి'..

### మోదీకి క్రేజీవాల్ సవాల్

న్యూఢిల్లీ

ప్రధాని నరేంద్ర మోదీ తన ధైర్యాన్ని ప్రదర్శించాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కోరారు. భారతీయ వస్తువులపై 50 శాతం సుంకానికి ప్రతీకారంగా అమెరికా దిగుమతులపై 75 శాతం సుంకం విధించాలని సవాల్ విసిరారు. ఆదివారం ఢిల్లీలో మీడియాతో అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడారు. 'ప్రధాని కొంత ధైర్యం చూపించాలని మేం కోరుతున్నాం. దేశం మొత్తం మీ వెనుక ఉన్నది. భారత్ ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకం విధించింది. బదులుగా మీరు అమెరికా దిగుమతులపై 75 శాతం సుంకం విధించండి. అప్పుడు ట్రంప్ తలొగ్గుతారో లేదో చూడండి' అని

-మిగతా 3 లో



## మూసీ పునరుజ్జీవానికి శ్రీకారం

- రూ.7,658 కోట్లతో గోదావరి తాగునీటి ప్రాజెక్టు ఫేజ్-2, 3 పథకాలకు నేడు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీల నీటి తరలింపు
- మూసీకి 2.5.. హైదరాబాద్ తాగునీటికి 17.5 టీఎంసీలు
- ఓఆర్ఆర్ ఫేజ్-2 తాగునీటి సరఫరానూ ప్రారంభించనున్న సీఎం

హైదరాబాద్/

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన కలల ప్రాజెక్టుగా చేపట్టిన మూసీ పునరుజ్జీవ పనులకు సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా రూ.7,360 కోట్లతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చెరువులను మంచినీటితో నింపేందుకు ఉద్దేశించిన గోదావరి తాగునీటి ప్రాజెక్టు ఫేజ్-2, 3 పథకాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. దీంతోపాటు ఓఆర్ఆర్ ఫేజ్-2లోని ప్రాంతాలకు తాగునీటి స రఫరా కోసం చేపట్టిన ప్రాజెక్టులో నిర్మించిన 15 కొత్త రిజర్వాయర్లను ప్రారంభించనున్నారు. కాగా, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) విధానంలో చేపడుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం 40 శాతం పెట్టుబడి పెట్టనుండగా, కాంట్రాక్టు సంస్థ 60 శాతం నిధులను సమకూర్చుకోనుంది. పనులు ప్రారంభమైన తరువాత నుంచి రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి 20 టీఎంసీల నీటిని తరలిస్తారు. వీటిలో మూసీ పునరుజ్జీవానికి 2.5 టీఎంసీల నీటిని కేటాయించి.. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలను నింపనున్నారు. మిగతా 17.5 టీఎంసీలను హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు

-మిగతా 3 లో




## నువ్వా..నేనా?



### రేపే ఎన్నికలు.. ఫలితాల ప్రకటన

- ఉపరాష్ట్రపతి ఎన్నికలో రసవత్తర పోరు
- ఆధిక్యంలో ఎన్డీయే అభ్యర్థి
- క్రాస్ ఓటింగ్‌పై 'ఇండియా' ఆశలు



న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ

మంగళవారం జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సన్నాహాలు తుది దశకు చేరుకున్నాయి. అధికార ఎన్డీయే, ప్రతిపక్ష కూటముల మధ్య తీవ్రమైన పోరు నడుస్తోంది. అయితే, బీజేడీ, బీఆర్ఎస్ సహా మొత్తం 18 మంది ఎంపీలు ఎవరికి ఓటు వేస్తారన్న విషయంలో స్పష్టత లేదు. ప్రస్తుత గణాంకాల ప్రకారం చూస్తే ఎన్డీయే అభ్యర్థి, మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్.. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్‌రెడ్డిపై 439–324 ఓట్ల తేడాతో స్పష్టమైన ఆధిక్యంలో ఉన్నారు. ఇది అన్ని పార్టీల ఎంపీలు తమ పార్టీల విధానాలకు అనుగుణంగా ఓటు వేస్తే, ఇంకా నిర్ణయం తీసుకోని వారి ఓట్లు ఎవరికి వెళ్తాయో పరిగణనలోకి తీసుకోకుండా లెక్కిస్తే వచ్చిన

-మిగతా 3 లో

## నిమజ్జనం సంపూర్ణం!

- ముగిసిన వినాయక నిమజ్జనాలు..
- గ్రేటర్ హైదరాబాద్‌లో గంగమ్మ ఒడికి 2.70 లక్షల విగ్రహాలు
- పోలీసు, జీహెచ్ఎంసీ సహా వివిధ శాఖలకు సీఎం అభినందనలు
- ఊరేగింపుల్లో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన 170 మందిపై కేసులు



హైదరాబాద్, -

వినాయక చవితి సందడి ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలు పూర్తయ్యాయి. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి వరకు 3,03,585 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం తర్వాత ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్ వైపునకు నగరంలోని ఇతర విగ్రహాలను అనుమతించారు. చంద్రగహణం నేపథ్యంలో ఆదివారం రాత్రి ఏడు గంటల్లోపే అన్ని చోట్ల నిమజ్జనాలు పూర్తి చేశారు. దిల్‌సుక్‌నగర్ కొత్తపేట పరిధిలోని

-మిగతా 3 లో

## గురుకులాలంటే ఎందుకంత చిన్నచూపు

### కేసీఆర్ హయాంలో గురుకుల విద్యా వ్యవస్థ దేశానికి ఆదర్శం



- విద్యపై చేసే వ్యయాన్ని క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌గా భావించిన కేసీఆర్
- 2500 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వని దుస్థితి
- సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు

హైదరాబాద్, – ప్రజా స్వేచ్ఛ

కాంగ్రెస్ పాలనలో గురుకుల విద్యావ్యవస్థ దీనస్థితికి చేరడం శోచనీయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రావు అన్నారు. విష జ్వరాలు, పాముకాట్లు, ఎలుక కాట్లు, కుక్కకాట్లు, ఫుడ్ పాయిజనింగ్‌తో విద్యార్థులు ఆస్పత్రుల పాలై ప్రాణాలు కోల్పోయే పరిస్థితి దాపురించిందని విమర్శించారు.గురుకులాల్లో పనిచేస్తున్న 2500 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వని

-మిగతా 3 లో



## జపాన్ ప్రధాని పదవికి షిగెరు ఇషిబా రాజీనామా

### పార్టీలో అంతర్గత విభేదాలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతోనే తాను ఈ నిర్ణయం

న్యూఢిల్లీ

జపాన్ దేశ ప్రధాన మంత్రి పదవికి షిగెరు ఇషిబా రాజీనామా చేశారు. పార్టీలో అంతర్గత విభేదాలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతోనే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ముఖ్యంగా జూలైలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి బాధ్యత వహించాలంటూ సొంత పార్టీ నేతల నుంచి ఇటీవల ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ఇషిబా తన పదవికి రాజీనామా చేశారు.గత ఏడాది ఫుమియో కిషిద రాజీనామా తర్వాత అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో షిగెరు ఇషిబా విజయం సాధించారు. అక్టోబర్‌లో జపాన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ఈ ఏడాది జూలైలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంట్ ఎగువసభలో అధికార సంకీర్ణ సర్కారు మెజారిటీని సాధించలేకపోయింది. అంతకుముందు దిగువ సభలోనూ మెజారిటీ కోల్పోయింది. దాంతో సొంత పార్టీ సభ్యుల నుంచి ప్రధానిపై ఒత్తిడి పెరిగింది ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వ మార్పు కోసం ముందస్తు ఎన్నికలు నిర్వహించాలా? వద్దా? అనే

-మిగతా 3 లో

## బీజేపీ బ్యాక్ ఆఫీస్‌గా ఈసీ?

- ఓట్ల చోరీదారులను పదేండ్లుగా కాపాడుతోంది
- జీఎస్టీ సంస్కరణల్లో మా విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోలేదు
- ప్రధాని అహం దేశాన్ని దెబ్బతీస్తోంది :
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ

కేంద్ర ఎన్నికల సంఘం "ఓట్ల చోరీలో బీజేపీ బ్యాక్–ఆఫీస్‌గా" మారిందా? అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. ఆదివారంనాడిక్కడ ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కర్నాటకలోని అలంద్ నియోజకవర్గంలో ఓటర్ల మోసానికి సంబంధించిన దర్యాప్తులో వివరాలను దాచిపెట్టాలని ఈసీ తీసుకున్న నిర్ణయంపై మీడియా నివేదికను

-మిగతా 3 లో

## మహేశ్ ఆత్మహత్యకు రేవంత్, సీతక్కదే బాధ్యత

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




హైదరాబాద్, – ప్రజా స్వేచ్ఛ

ములుగు మునిసిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుడు మహేశ్ ఆత్మహత్యకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క బాధ్యత వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. నెలలతరబడి వేతనాలు చెల్లించని కారణంగానే మహేశ్ ఆత్మహత్యచేసుకొని చనిపోయారని, ఈ దుస్థితిని తెచ్చినందుకు సీఎం, మంత్రి క్షమాపణలు చెప్పాలని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ఫోన్‌లో మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్.. అండగా

-మిగతా 3 లో

## బీసీ బిల్లుకు కేంద్రం అడ్డు

### కేసీఆర్ కుటుంబమంతా దొంగల ముఠానే

- ఆయన పిలిస్తే కవిత వెళ్లదా?: మహేశ్‌గౌడ్
- విపక్షాల కుట్రలు వెల్లడిస్తాం: పొంగులేటి
- బీసీల కోసం రాహుల్ పోరాటం: సీతక్క
- కేంద్రం మెడలు వంచుతాం: సురేఖ

3 లో



# ముంబయిలో భారీ అగ్ని ప్రమాదం


## ఒకరి మృతి, 19 మందికి గాయాలు



**ముంబయి - ప్రజా స్వేచ్ఛ**

దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా, మరో 19 మంది గాయపడ్డారు. దహిసర్ ప్రాంతంలోని ఒక బిల్డింగ్‌లో ఆదివారం మధ్యాహ్నం ఈ విషాద సంఘటన చోటుచేసుకుంది. విషయం తెలిసిన వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది 36 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. దహిసర్ తూర్పు ప్రాంతంలోని ఒక భవంతిలో ఏడో అంతస్థులో మధ్యాహ్నం 4:30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఏడు ఫైరింజన్లతో అక్కడికి చేరుకున్నారు. దాదాపు గంటన్నరకు పైగా శ్రమించి మంటల్ని ఆర్పేశారు. ఈ ప్రమాదం నుంచి 36 మందిని నిచ్చెన సాయంతో కాపాడారు. వీళ్లలో గాయపడిన 19 మందిని సమీపంలోని నార్తర్న్ కేర్ హాస్పిటల్‌లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వాళ్లలో నాలుగేళ్ల బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారు.ఏడో అంతస్థులోని విద్యుత్ వైర్లు దెబ్బతినడం.. లేదా సరిగా పనిచేయకపోవడం వల్ల ప్రారంభమైన మంటలు క్రమంగా మంటలు ఎలక్ట్రిక్ వలయం నుంచి పై అంతస్థులకు వ్యాపించాయని ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు తెలిపారు.

# ట్రంప్ సలహాదారు నావారో భారత్‌పై మరోసారి తీవ్ర వాఖ్యలు




**వాషింగ్టన్ డీసి - ప్రజా స్వేచ్ఛ**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వాణిజ్య సలహాదారుడు పీటర్ నావారో శనివారం భారతదేశంపై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో " భారతదేశం రష్యన్ చమురు కేవలం లాభం కోసమే కొంటుంది. రష్యా ఉక్రెయిన్ దాడి చేయకముందు ఎప్పుడూ కొనలేదని నావారో ఆరోపించారు..ఇటీవలే వాషింగ్టన్ పోస్ట్ వార్తా కథనంలో ట్రంప్ పరిపాలనలో భారత్-అమెరికా సంబంధాలపై విభేదాలు ఉన్నాయన్నారు. భారతదేశం వల్ల అమెరికన్‌ల ఉద్యోగాలు పోతున్నాయన్నారు. నవారో తరచుగా భారత్‌ను టార్గెట్ చేస్తూ విమర్శిస్తున్నారు. అయితే బుధవారం భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రంధీర్ జైస్వాల్ నావారో వాఖ్యలను ఖండించారు. నావారో చేసిన తప్పుడు, మార్గదర్శకత లేని వాఖ్యలను మేము తిరస్కరిస్తున్నామని స్పష్టం చేశారు. మరోవైపు నవారో పోస్ట్‌పై ఎక్స్ ఫ్యాక్ట్ చెక్ చేసింది. ఇది తప్పుడు వార్తాగా తేల్చింది. దీనిపై కూడా నవారో మండిపడ్డారు . ఎక్స్‌లో మస్క్ అమెరికా వ్యతిరేక ప్రచారానికి అనుమతిస్తున్నారంటూ రాసుకొచ్చారు%ౌ

# భారత్‌లో ఇంటర్నెట్‌కు అంతరాయం

## ఎర్ర సముద్రంలో కేబుల్స్ తెగిపోయి..

**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**



ఎర్ర సముద్రంలో కేబుల్ కట్స్ వల్ల భారత్, పాక్, యూఏఈ సహా ఆసియా, మధ్య ప్రాచ్య దేశాల్లో ఇంటర్నెట్ సేవలకు ఆదివారం అంతరాయం ఏర్పడింది. ఈ కేబుల్ కట్స్‌కు కారణాలేమిటో వెల్లడి కాలేదు. సౌదీ అరేబియాలోని జెడ్డా సమీపంలో ఉన్న ఎస్ఎండబ్ల్యూ4, ఐఎంఈడబ్ల్యూఈ కేబుల్ సిస్టమ్స్ విఫలమైనట్లు మానిటరింగ్ గ్రూప్ నెట్‌బ్లాక్స్ తెలిపింది.అనేక దేశాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీకి విఘాతం కలిగినట్లు పేర్కొంది. అజ్యూర్ క్లౌడ్ సర్వీస్‌కు కూడా అంతరాయాలు ఏర్పడినట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. మిడిల్ ఈస్ట్ గుండా వెళ్లే మార్గాల్లోని యూజర్లపై ఈ ప్రభావం పడుతుందని తెలిపింది.

# కోల్‌కతాలో మరో దారుణం

**-పుట్టిన రోజున యువతిపై అఘాయిత్యం**
**-పరారీలో ఇద్దరు నిందితులు**




**కోల్‌కతా - ప్రజా స్వేచ్ఛ**

పశ్చిమబెంగాల్‌లో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఆర్‌జికర్ ఆసుపత్రిలో హత్యాచారం, ఓ న్యాయ విద్యార్థినిపై లైంగికదాడి ఘటనన మరవకముందే.. కోల్‌కతాలో మరో షాకింగ్ ఘటన వెలుగు చూసింది. ఓ యువతిపై ఇద్దరు యువకులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. యువతి పుట్టిన రోజున సెలబ్రేట్ చేసుకుందామని ఓ ఇంటికి తీసుకెళ్లి ఈ దారుణానికి తెగబడ్డారు. యువతి ఫిర్యాదుతో నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులిద్దరూ పరారీలో ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోల్‌కతాలో హరిదేవ్‌పురాకు చెందిన 20 ఏళ్ల యువతి ఆమె పుట్టిన రోజునే అఘాయిత్యానికి గురయ్యింది. యువతికి పరిచయం ఉన్న ఇద్దరు యువకులు ఆమెను బర్త్‌డే పార్టీ పేరిట ఓ ఇంటికి తీసుకెళ్లారు. ఆ తర్వాత ఆ యువతిపై దారుణానికి పాల్పడ్డారు. కోల్‌కతా నగర శివారులోని రీజెంట్ పార్క్ ప్రాంతంలో శుక్రవారం ఈ దారుణం జరిగింది. ప్రస్తుతం పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను చందన్ మాలిక్, దేబాంగ్షు బిశ్వాస్ ఎలియాస్ దీప్‌గా గుర్తించారు. దీప్ ప్రభుత్వ ఉద్యోగి అని కూడా తెలుస్తోంది. యువతి పుట్టిన రోజు సందర్భంగా చందన్ మాలిక్ ఆమెను బర్త్‌డే సెలబ్రేట్ చేసుకుందామని నమ్మించి దీప్ ఇంటికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత అక్కడ వారు భోజనం చేశారు. అనంతరం బాధితురాలు తన ఇంటికి వెళ్లడానికి సిద్ధమైంది. కానీ నిందితులు ఆమెను అడ్డుకున్నారు. గదిలో బంధించి దారుణానికి ఒడిగట్టారు. మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు అక్కడి నుంచి తప్పించుకున్న బాధితురాలు తన ఇంటికెళ్లి కుటుంబసభ్యులకు జరిగిన దారుణం గురించి తెలిపింది. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

### రాష్ట్రంలో వరుస ఘటనలు

రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు వరుసగా చోటు చేసుకోవటం ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఏడాది జూన్ 25న ఓ న్యాయ విద్యార్థి లా కాలేజీ క్యాంపస్‌లోనే లైంగికదాడికి గురైన విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం విదితమే. ఈ కేసులో కోల్‌కతా పోలీసులు అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) విద్యార్థి నాయకుడు మోనోజిత్ మిశ్రాతో పాటు మరో ముగ్గురికి వ్యతిరేకంగా చార్జిషీట్‌ను కూడా నమోదు చేశారు. గతేడాది ఆగస్టులో కోల్‌కతాలోని ఆర్‌జికర్ వైద్య కళాశాల, ఆస్పత్రిలో ఓ డాక్టర్‌పై హత్యాచారం జరగటం దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన విషయం విదితమే.

# వెనిజులాపై అమెరికా యుద్ధ సన్నాహాలు



**వాషింగ్టన్ ప్రజా స్వేచ్ఛ**

ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న దేశం వెనిజులాపై అమెరికా యుద్ధ సన్నాహాలు చేస్తోంది. ఆ దేశం చుట్టు అమెరికా యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు మోహరించి ఉన్నాయి. ఏ క్షణమైనా అమెరికా దళాలు వెనిజులాలో చొరబడొచ్చని ప్రచారం జరుగుతోంది. ఇటీవలే వెనిజులాలోని మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని ట్రంప్ స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు. మదురో ఎన్నికను అమెరికా గుర్తించడంలేదని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవెట్టి వెల్లడించారు. కేవలం మాదకద్రవ్యాల ముఠాల కోసం యుద్ధం స్థాయిలో అమెరికా ఈ బలగాలను మోహరించింది. మొత్తం ఎనిమిది వార్‌షిప్‌లను అక్కడకు పంపింది. ది ఇవో జిమా యాంఫిబియస్ రెడీగ్రూప్‌లోని యూఎస్ఎస్ శాన్ ఆంటోనియో, యూఎస్ఎస్ ఇవో జిమా, యూఎస్ఎస్ ఫోర్ట్ లాడర్‌డేల్ నౌకలు 4,500 మంది సైనికులతో కరేబియన్ సముద్రంలోకి వెళ్లాయి. 22వ మెరైన్ యూనిట్ కమాండోలు 2,200 మంది వీరిలో ఉన్నారు. ఏవీ-8బీ హారియర్ అటాక్ ఎయిర్ క్రాఫ్ట్, గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్లైన యూఎస్ఎస్ జాన్సన్ డున్హమ్, యూఎస్ఎస్ గ్రేవ్లీ దక్షిణ కరేబియన్‌లో మోహరించాయి. తూర్పు పసిఫిక్‌లో యూఎస్ఎస్ శాంప్సన్ త్వరలో వచ్చి చేరనుంది. ఒక్కో డెస్ట్రాయర్‌లో 90 క్షిపణులు ఉంటాయి. గైడెడ్ మిసైల్ క్రూయిజర్ యూఎస్ఎస్ లేక్ ఎరి, మిన్నియాపోలీస్ సెయింట్ పాల్ కూడా వెనుజువెలాపై గురిపెట్టి ఉన్నాయి. శుక్రవారం రాత్రి 10 ఎఫ్-35 ఫైటర్ జెట్‌లను ప్యూర్టోరికోలో మోహరించింది. పెద్ద సంఖ్యలో పీ-8 నిఘా విమానాలను రంగంలోకి దించింది. అమెరికా మోహరింపులను మదురో తప్పుపట్టారు. గత 100 ఏళ్లలో తమ దేశం ఎదుర్కొన్న అతిపెద్ద ముప్పుగా దానిని వర్ణించారు. 8 నౌకల్లో 1200 క్షిపణులను తమపై గురిపెట్టారని విమర్శించారు.

# బీడీలపై జీఎస్టీ తగ్గింపు

## చావుకు రాయితీ ఇవ్వడమే ఆరోగ్య నిపుణుల ఆందోళన



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**

బీడీలపై ఉన్న జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించాలన్న కేంద్రం నిర్ణయంపై ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. చౌకైన బీడీల వల్ల వాటి వినియోగం పెరుగుతుందని.. ముఖ్యంగా పేదలు, అణగారిన వర్గాల్లో ఇది పెరిగి దేశ పొగాకు సంబంధిత అనారోగ్య భారాన్ని పెంచుతాయని వారు తెలిపారు. బీడీల వినియోగం పెరగడం క్యాన్సర్లు, ఇతర వ్యాధులకు దారి తీస్తుందని పొగాకు వాడకం నియంత్రణకు కృషి చేస్తున్న డాక్టర్ విశాల్ రావు తెలిపారు.వాటి ధర తగ్గించడమంటే చావుకు రాయితీ ఇవ్వడమేనని అన్నారు. మిగతా పొగాకు ఉత్పత్తులపై 40 శాతం జీఎస్టీని విధించి, బీడీలపై తగ్గించడం సరి కాదని.. పొగాకు ఉత్పత్తులపై పన్నుల్లో ఏకరూపతను తీసుకురావాలని ఆయన కోరారు. ఎక్కువ పన్ను పొగాకు వినియోగాన్ని నిరోధించడంలో సాయపడుతుందని ఢిల్లీ ఎయిమ్స్ డాక్టర్ ఉమా కుమార్ తెలిపారు.తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో ధరను పది శాతం పెంచడం వల్ల పొగాకు వినియోగం 4-8 శాతం తగ్గినట్టు అధ్యయనాలు తెలుపుతున్నాయి. పొగాకు సంబంధిత వ్యాధుల కారణంగా భారత్ ఏటా రూ.1.77 లక్షల కోట్లను వైద్య ఖర్చుల రూపంలో కోల్పోతోందని అంచనా.

# ఉక్రెయిన్‌పై 805 డ్రోన్లు, క్షిపణులతో రష్యా దాడి



**కీవ్ - ప్రజా స్వేచ్ఛ**

రష్యా ఆదివారం తెల్లవారుజామున 805 డ్రోన్లు, డెకారులను ఉక్రెయిన్‌పై ప్రయోగించింది. ఉక్రెయిన్‌పై సైనిక చర్యలు చేపట్టిన అనంతరం ఇది అతిపెద్ద దాడి కావడం గమనార్హం. ఆదివారం నాటి దాడి రష్యా డ్రోన్ దాడిలో అతిపెద్దదని ఉక్రెయిన్ వైమానికి దళ ప్రతినిధి యూరి ఇహ్నాత్ ధృవీకరించారు. 13రకాల క్షిపణులను కూడా ప్రయోగించిందని అన్నారు. ఉక్రెయిన్ 747 డ్రోన్లు మరియు 4 క్షిపణులను కూల్చివేసి, తటస్థీకరించినట్లు వైమానిక దళం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉక్రెయిన్ అంతటా 37 ప్రదేశాల్లో తొమ్మిది క్షిపణి దాడులు మరియు 56 డ్రోన్ దాడులు జరిగినట్లు తెలిపింది. కూల్చివేసిన డ్రోన్లు, క్షిపణుల శిథిలాలు 8 ప్రదేశాలపై పడ్డాయని అన్నారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై జరిగిన రష్యా దాడిలో ఇద్దరు మరణించగా, 15మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. మంత్రుల కేబినెట్ భవనం పైకప్పు నుండి పొగలు ఎగిసిపడుతున్న దృశ్యాలు మీడియాలో కనిపించాయి. అయితే ఈ పొగ దాడి కారణంగా వెలువడిందా లేదా డ్రోన్లు, క్షిపణుల శిథిలాల కారణంగా వెలువడిందా అన్న అంశంపై స్పష్టత లేదు .మొదటిసారిగా, ప్రభుత్వ భవనం రష్యా దాడిలో దెబ్బతినింది అని ఉక్రెయిన్ ప్రధాని యులియా స్విరిడెంకో అన్నారు. రష్యా డ్రోన్ శిథిలాలు కీవ్‌లోని స్వియాటోషిన్స్కి జిల్లాలోని తొమ్మింది అంతస్తుల భవనాన్ని మరియు డార్నిట్స్కి జిల్లాలోని నాలుగంతస్తుల భవనాన్ని ఢకొట్టాయని మేయర్ విటాలి క్లిట్ష్కో తెలిపారు.


# సెయిల్ కుంభకోణం కేసులో అవన్ స్టీల్ కంపెనీపై సిబిఐ ఎఫ్ఐఆర్

**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) ఉక్కు అమ్మకాలకు సంబంధించిన కుంభకోణం కేసులో అవన్ స్టీల్ ఇండిస్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కుంభకోణంలో వెంకటేష్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (వీఐపీపీఎల్)పై ఇప్పటికే కేసు నమోదైంది. తాజాగా లోక్‌పాల్ సూచన మేరకు అవన్ స్టీల్‌పై కూడా కేసు పెట్టారు. సెయిల్ అధికారుల అండదండలతో అవన్‌కు చౌకగా ముడి పదార్థాలను విక్రయించారని, ఫలితంగా సెయిల్ కంపెనీ రూ.263 కోట్ల నుంచి రూ.370 కోట్ల వరకూ నష్టాన్ని చవిచూసిందని ఎఫ్ఐఆర్‌లో ఆరోపించారు.

# ఏఐతో అణు ముప్పు!

## ఏఐ గాడ్ ఫాదర్ జెఫ్రీ హింటన్ హెచ్చరిక



**వాషింగ్టన్ ప్రజా స్వేచ్ఛ**

కృత్రిమ మేధ పితామహుడు జెఫ్రీ హింటన్ సంచలన హెచ్చరిక చేశారు. మానవాళికి ఏఐ ముప్పుగా పరిణమించే ప్రమాదం ఉందన్నారు. సామాన్యుడు సైతం ఏఐని ఉపయోగించుకుని అణు బాంబును తయారు చేయవచ్చునని చెప్పారు. ఓ సాధారణ వ్యక్తి త్వరలో ఏఐ సహాయంతో జీవాయుధాలను తయారు చేయగలుగుతాడని, అది చాలా భయంకరమని తెలిపారు.సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందడం వల్ల కంపెనీలు మునుపెన్నడూ లేనంత లాభాలను ఆర్జిస్తాయని, ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోతారని జెఫ్రీ హింటన్ హెచ్చరించారు. నిరుద్యోగం విపత్కర స్థాయికి పెరుగుతుందన్నారు. సంపన్నులు తమ పనులు చేయించుకోవడం కోసం ఉద్యోగులు, కార్మికులకు బదులుగా ఏఐని వాడుకుంటారని చెప్పారు. మెటా చీఫ్ ఏఐ సైంటిస్ట్ యాన్ లెకున్ అభిప్రాయం వేరొకలా ఉంది. లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ పరిమితంగా ఉన్నాయని, భౌతిక ప్రపంచంతో అర్థవంతంగా వ్యవహరించజాలవని తెలిపారు.

# బ్లడ్ మూన్ కనువిందు

(మొదటి తరువాయి)

నిమిషాల పాటు పూర్తిగా భూమి నీడలోనే చంద్రుడు ఉండనున్నాడు. అయితే ఈ గ్రహణాన్ని బ్లడ్‌మూన్‌గా పిలుస్తున్నారు. అలాగే సోమవారం ఉదయం 2:25 గంటలకు చంద్రగ్రహణం వీడనున్నది. సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖపై వచ్చినప్పుడు ఈ చంద్ర గ్రహణం ఏర్పడుతుంది. కాగా ఈ చంద్రగ్రహణాన్ని చూసేందుకు పెద్దలు, చిన్నారులు ఆసక్తి కనబర్చారు. టెలీస్కోప్‌ల ద్వారా ఈ దృశ్యాన్ని వారు వీక్షించారు. కాగా నిపుణులు, హేతువాదులు ఈ చంద్రగ్రహణం గురించిన అసలు విషయాలను వివరిస్తూ అపోహలను తొలగించే ప్రయత్నాలు చేశారు. వారికి అవగాహనను కల్పించారు. కాగా ఆసియా, పశ్చిమ ఆస్ట్రేలియాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం.. ఐరోపా, ఆఫ్రికా, తూర్పు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పాక్షిక చంద్రగ్రహణం కనిపించింది.

# 'ధైర్యముంటే అమెరికా వస్తువులపై 75 శాతం సుంకాలు విధించండి'..

(మొదటి తరువాయి)

అన్నారు.కాగా, ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు అమెరికా పత్తి దిగుమతులపై 11 శాతం సుంకం మినహాయింపుపై మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు, అలాంటి చర్య ముఖ్యంగా గుజరాత్ రైతులకు ప్రతికూలంగా ఉంటుందని, అమెరికా రైతులను సంపన్నం చేస్తుందని అన్నారు.మరోవైపు కేంద్రం నిర్ణయం వల్ల భారతీయ పత్తి ఉత్పత్తిదారులను దుర్బలంగా మార్చిందని అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. వారి ఉత్పత్తులను విక్రయించడానికి తగిన మార్కెట్ లేదని ఆరోపించారు. దీంతో అప్పుల భారంతో కుంగిపోయిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడే అవకాశమున్నదని ఆయన హెచ్చరించారు.

# మూసీ పునరుజ్జీవానికి శ్రీకారం

(మొదటి తరువాయి)

వినియోగించనున్నారు. నీటి తరలింపు మార్గం మధ్యలో ఉన్న 7 చెరువులను కూడా నింపుతారు. 2027 డిసెంబరు నాటికి హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చేందుకు, ప్రతిరోజూ నల్లా నీటిని సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టును ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది.ద

# నిమజ్జనం సంపూర్ణం!

(మొదటి తరువాయి)

సమతాపురి కాలనీలో ఏర్పాటు చేసిన 63 అడుగుల వినాయక విగ్రహాన్ని నిర్వాహకులు ఫైరింజన్ల సాయంతో అదే చోట నిమజ్జనం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగియడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శోభాయాత్రలు సజావుగా సాగేందుకు కృషి చేసిన మునిసిపల్, పోలీసు, విద్యుత్, రెవెన్యూ, పంచాయతీ, ఇతర శాఖల సిబ్బందితో పాటు పారిశుధ్య కార్మికులు, క్రేన్ ఆపరేటర్లరకు అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్ మహానగరంలో గణేష్ నిమజ్జన వేడుకలు 40 గంటలపాటు కొనసాగాయని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. 40 అడుగులు కంటే ఎత్తున్న విగ్రహాల సంఖ్య పెరగడంతో ఈసారి శోభాయాత్ర కొంత ఆలస్యమైందన్నారు. నిమజ్జన ఊరేగింపుల్లో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన 170 మందిని గుర్తించి కేసులు నమోదు చేశామని తెలిపారు. అలాగే, ఊరేగింపుల్లో చిన్నపాటి గొడవలకు సంబంధించి 5 కేసులు నమోదయ్యాయని, పిక్ పాకెటింగ్ కేసుల్లో మరికొందరిని పట్టుకున్నామని సీపీ వివరించారు.ద

# జపాన్ ప్రధాని పదవికి షిగెరు ఇషిబా రాజీనామా

(మొదటి తరువాయి)




అంశంపై సెప్టెంబర్ 8న చర్చించి నిర్ణయం తీసుకునేందుకు లిబరల్ డెమొక్రటిక్ పార్టీ సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మీడియా సమావేశం నిర్వహించిన ఇషిబా.. ప్రధాని పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీకి ప్రత్యామ్నాయ నేతను ఎన్నుకునేందుకుగాను ఎన్నికలు నిర్వహించే ప్రక్రియను మొదలు పెడుతున్నట్లు చెప్పారు.

# మహేశ్ ఆత్మహత్యకు రేవంత్, సీతక్కదే బాధ్యత

(మొదటి తరువాయి)




ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు మహేశ్ భార్యకు ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. లేదంటే బాధితుని కుటుంబంతోపాటు, జీతాలందని కార్మికులకు న్యాయం జరిగే వరకూ బీఆర్ఎస్ ఆ?ధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట నాయకుడు రావినారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా కేటీఆర్ ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రాంత రాజకీయ చైతన్యానికి, పోరాట స్ఫూర్తికి నిలువెత్తు రూపమైన కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి అని పేర్కొన్నారు.

# నువ్వా.. నేనా?..

(మొదటి తరువాయి)

లెక్క.బీజేడీ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్ నుంచి నలుగురు, అకాలీదళ్, జడ్‌పీఎం, వీవోటీటీపీ నుంచి ఒక్కొక్కరు, అలాగే ముగ్గురు స్వతంత్ర ఎంపీలు ఇప్పటికీ తమ మద్దతు ఎవరికి అనేది స్పష్టంగా వెల్లడించలేదు. ఓటర్ల సంఖ్య ప్రస్తుతం 781గా ఉంది, ఇందులో శిబు సోరెన్ మరణంతో సహా ఏడు ఖాళీలు ఉన్నాయి. బీజేడీకి చెందిన సస్మిత్ పాత్ర, బీఆర్ఎస్‌కు చెందిన కే సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ సరైన సమయంలో పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అయితే, జేపీఎం, వీవోటీటీపీ ఎంపీలు మాత్రం ఇప్పటి వరకు స్పందించలేదు.



**జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఆప్ మద్దతు**

ఇండియా కూటమి నుంచి బయటకు వచ్చిన ఆప్ తమ 10 మంది ఎంపీల మద్దతును జస్టిస్ రెడ్డికి ప్రకటించింది. 11 మంది సభ్యుల వైసీపీ రాధాకృష్ణకు మద్దతు ప్రకటించింది. ఇది రహస్య ఓటింగ్ కాబట్టి, ఇరు పక్షాలు క్రాస్ ఓటింగ్‌పై ఆశలు పెట్టుకున్నాయి. ఈ ఎన్నికలను రాజ్యాంగం వర్సెస్ ఆరెస్సెస్-బీజేపీ పోరుగా అభివర్ణిస్తున్న ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలుగు వ్యక్తి అని చెప్తూనే ఇతర రాజకీయ కారణాలను ప్రస్తావిస్తూ టీడీపీ, వైసీపీ, జనసేన ఎంపీలను లక్ష్యంగా చేసుకుని ఓట్లు అభ్యర్థిస్తున్నది. కాంగ్రెస్ లోక్‌సభ విప్ మాణికం ఠాగూర్ ఆదివారం వైసీపీ లోక్‌సభ ఫ్లోర్ లీడర్ మిథున్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ.. మిమ్మల్ని జైలుకు పంపిన టీడీపీ, బీజేపీ అభ్యర్థికి ఓటేస్తారా? లేక రాజ్యాంగాన్ని కాపాడేందుకు పోరాడుతున్న జస్టిస్ రెడ్డికి ఓటేస్తారా? అని ప్రశ్నించారు. ఫలితం ఎలా ఉన్నా, ఈ పోరులో విజయం సాధించాలని ఇండియా కూటమి పట్టుదలగా ఉంది. క్రాస్ ఓటింగ్ జరిగి తమకు విజయం లభిస్తుందని ధీమాగా ఉంది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి 324 ఓట్లు వచ్చి ఓడిపోయినా.. ఓడిన అభ్యర్థికి లభించిన అత్యధిక ఓట్లు ఇవే అవుతాయి. 2002లో సుశీల్ కుమార్ షిండేకు 305 ఓట్లు లభించాయి. అప్పుడు గెలుపొందిన భైరాన్‌సింగ్ షెకావత్‌కు 454 ఓట్లు వచ్చాయి. ఇది ఇప్పటివరకు జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అత్యంత గట్టి పోటీ.

**మాక్ పోలింగ్‌లో అధికార, విపక్షాలు**

ఈసారి ఎన్డీయే అభ్యర్థికి 500 ఓట్లు దాటే అవకాశం లేదు. 2022 ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు తమ ఓట్లు వేయకపోవడంతో జగదీప్ ధన్‌ఖడ్‌కు 528 ఓట్లు వచ్చాయి. ఆయన కంటే ముందు ఉపరాష్ట్రపతిగా ఉన్న ఎం వెంకయ్యనాయుడు 516 ఓట్లు పొందారు. బీజేపీ ఇప్పటికే తన ఎంపీలకు ప్రాధాన్యత ఓటింగ్ విధానంలో ఎలా ఓటు వేయాలో శిక్షణ మొదలుపెట్టింది. అటు, ప్రతిపక్షం సోమవారం సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో మాక్ పోల్ నిర్వహిస్తున్నది. దీని తరువాత, పార్లమెంట్ అనెక్స్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విందు ఇవ్వనున్నారు. ఓటర్లు తమ ప్రాధాన్యతలను గుర్తించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక పెన్నులను సరఫరా చేస్తుంది. ఓటర్లు తమ బ్యాలెట్ పేపర్‌ను ఈ

# గురుకులాలంటే ఎందుకంత చిన్నచూపు..

దుస్థితి అని హరీశ్‌రావు విమర్శించారు. ఉపాధ్యాయుల దినోత్సవం నాడు ఆడంబరంగా ప్రకటనలు చేయడం కాదు ముందు వారికి సకాలంలో జీతాలు చెల్లించమని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా నేనే ఇకనుంచి గురుకులాలను పర్యవేక్షిస్తానని చెప్పిన మాటలు నీటి మూటలు అయ్యాయని విమర్శించారు. కల్తీ ఆహారం పెడితే జైలుకే అని ఇచ్చిన ప్రకటనలు గాలి మాటలయ్యాయయని అన్నారు.కేసీఆర్ హయాంలో గురుకుల విద్యా వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిస్తే రేవంత్ రెడ్డి పాలనలో నరక కూపాలుగా మారాయని హరీశ్‌రావు విమర్శించారు. నాడు 294గా ఉన్న గురుకులాల సంఖ్యను 1024 కి పెంచిన ఘనత కేసీఆర్‌ది అని కొనియాడారు. గురుకులాల్లో లక్ష 90 వేలుగా ఉన్న విద్యార్థుల సంఖ్యను ఆరున్నర లక్షలకు పెంచి నాణ్యమైన విద్యను కేసీఆర్ అందించారని తెలిపారు. విద్యపై చేసే వ్యయాన్ని క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌గా భావించిన కేసీఆర్ గురుకులాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ 22 నెలల పాలనలో గురుకులాల ఖ్యాతి అధఃపాతాళానికి దిగజారిందని అన్నారు. ఇది మీ అసమర్థత పాలనకు మరో నిదర్శనమని పేర్కొన్నారుగురుకులాలంటే ఎందుకు మీకు అంత చిన్న చూపు అని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి గాడిదప్పిన గురుకుల విద్యా వ్యవస్థపై శ్రద్ధ వహించమని సూచించారు. తక్షణమే గురుకులాల సమస్యలను పరిష్కరించాలన్నారు. 2500 మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్ జీతాలను చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

# బీజేపీ బ్యాక్ ఆఫీస్‌గా ఈసీ?

(మొదటి తరువాయి)

స్పందించారు. 2023 మేలో కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు అలంద్ నియోజకవర్గంలో ఓటర్ల "భారీ తొలగింపు" జరిగిందని అన్నారు. ఫారమ్ 7 దరఖాస్తులను నకిలీ చేయడంతో వేలాది మంది ఓటర్ల హక్కులను తొలగించారని ఖర్గే వివరించారు. "ఫిబ్రవరి 2023లో ఒక కేసు నమోదైంది. దర్యాప్తులో 5,994 నకిలీ దరఖాస్తులు వెల్లడయ్యాయి. ఓటర్లను మోసం చేయడానికి జరిగిన భారీ ప్రయత్నానికి స్పష్టమైన సాక్ష్యం. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం నిందితులను పట్టుకోవడానికి సీఐడీ దర్యాప్తునకు ఆదేశించింది" అని ఆయన అన్నారు. దర్యాప్తునకు అవసరమైన కీలకమైన సమాచారాన్ని ఎన్నికల సంఘం దాచిపెట్టిందని ఆరోపించారు. "ఓటు చోరీ" వెనుక ఉన్నవారికి ఎన్నికల సంఘం "కవచం"గా పని చేస్తోందని విమర్శించారు. ఓటు చోరీ వెనుక ఉన్నవారిని సమర్థవంతంగా రక్షించిందని ఖర్గే ఆరోపించారు. దేశ ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అవస రాన్ని నొక్కిచెబుతూ దర్యాప్తునకు అవసరమైన సాక్ష్యాలను అడ్డుకున్నారనే ఆరోపణలపై ఈసీ ఉద్దేశ్యాన్ని ఆయన ప్రశ్నించారు. "ముఖ్యమైన ఆధారాలను ఈసీఐ అకస్మాత్తుగా ఎందుకు బ్లాక్ చేసింది? అది ఎవరిని రక్షిస్తోంది? ఈసీ.. బీజేపీ ఓటు చోరీ విభాగమా? సీఐడీ దర్యాప్తు ను పక్కదారి పట్టించడానికి బీజేపీ ఒత్తిడికి ఈసీఐ తలొగ్గుతోందా? వ్యక్తి ఓటు హక్కును కాపాడాలి. దేశ ప్రజాస్వా మ్యాన్ని కాపాడాలి"అని ఖర్గే అన్నారు.

**ప్రధాని మోడీ అహం దేశానికి దెబ్బ**

జీఎస్టీ సంస్కరణల్లో తాము చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోలేదని, ప్రధాని మోడీ అహం దేశాన్ని దెబ్బతీస్తోందని మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. జీఎస్టీ సంస్కరణలను అమలు చేయడంలో జాప్యంపై మోడీ ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. పరోక్ష పన్నులను సరళీకరించాలని తాము నిరంతరం డిమాండ్ చేస్తోన్నామన్నారు. "గత ఎనిమిదేండ్లుగా మేము జీఎస్టీ సంస్కరణల కోసం పోరాడుతున్నాం. కానీ మోడీ ప్రభుత్వం ఆ విజ్ఞప్తులను ఎప్పుడూ అంగీకరించలేదు" అని ఖర్గే అన్నారు. మోడీ సర్కార్ అహం జాతీయ ప్రయోజనాలను దెబ్బతీసిందని ఆరోపించారు. మోడీ విదేశాల్లో విదేశీ నాయకులను ప్రోత్సహించడం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇది భారతదేశ విదేశాంగ విధానానికి తప్పుడు ఉదాహరణగా నిలుస్తుందని హెచ్చరించారు. కేంద్రం పదే పదే నిర్లక్ష్యం చేసినప్పటికీ తాము ప్రజల సమస్యలను లేవనెత్తుతూనే ఉంటామని పునరుద్ఘాటించారు. రాష్ట్రాలకు ఐదేండ్లపాటు పూర్తిగా పరిహారం చెల్లించాలి కాంగ్రెస్ పార్టీ 2019, 2024 మ్యానిఫెస్టోలలో "సరళమైన,హేతుబద్ధమైన" పన్ను వ్యవస్థతో జీఎస్టీ 2.0ను ప్రతిపాదించిందని, జీఎస్టీ సమ్మతిని సరళీకరించాలని డిమాండ్ చేసిందని ఖర్గే అన్నారు. ఇది ఎంఎస్ఎంఈలు, చిన్న వ్యాపారాలను "తీవ్రంగా ప్రభావితం చేసిందని" చెప్పారు. 2005లో యూపీఏ ప్రభుత్వం జీఎస్టీ ఆలోచనను తొలిసారిగా ప్రవేశపెట్టిందని, 2011లో అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ జీఎస్టీ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు బీజేపీ దానిని వ్యతిరేకించిందని ఖర్గే గుర్తు చేశారు. "మోడీ జీఎస్టీని తీవ్రంగా వ్యతిరేకించారు. నేడు, అదే బీజేపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లను చేస్తోంది. సామాన్యుల నుంచి పన్ను వసూలు చేయడం గొప్ప విజయం అన్నట్టుగా ప్రస్తుత ప్రభుత్వం కపటత్వాన్ని ప్రదర్శిస్తోంది" అని ఆయన ఆరోపించారు. తక్కువ పన్ను రేట్ల కారణంగా ఆదాయం తగ్గే అవకాశమున్నందున 2024-25ని బేస్ ఇయర్‌గా తీసుకుని రాష్ట్రాలకు ఐదేండ్లపాటు పూర్తిగా పరిహారం చెల్లించాలని ఖర్గే డిమాండ్ చేశారు.

# బీసీ బిల్లుకు కేంద్రం అడ్డు

**కేసీఆర్ కుటుంబమంతా దొంగల ముఠానే**
**ఆయన పిలిస్తే కవిత వెళ్లదా?: మహేశ్‌గౌడ్**
**విపక్షాల కుట్రలు వెల్లడిస్తాం: పొంగులేటి**
**బీసీల కోసం రాహుల్ పోరాటం: సీతక్క**
**కేంద్రం మెడలు వంచుతాం: సురేఖ**

కామారెడ్డి,

గవర్నర్ వద్ద బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు చట్టబద్ధత కల్పించకుండా బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కేంద్రం తలచుకుంటే ఒక్క రోజులోనే రిజర్వేషన్లపై చట్టం తీసుకురావచ్చని.. కానీ కాంగ్రెసకు ఎక్కడ పేరు వస్తుందోననే భయంతో అడ్డుకుంటోందన్నారు. కామారెడ్డిలో ఈ నెల 15న నిర్వహించనున్న బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ సన్నాహక సమావేశం ఆదివారం కామారెడ్డిలోని శుభం కన్వెన్షన్‌లో జరిగింది. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్.. ప్రధాని మోదీ, అమిత్‌షాలను ఒప్పించకపోవడం సిగ్గు చేటన్నారు. బీసీ బిడ్డలైన సంజయ్, ఎంపీ అర్వింద్ బిల్లుపై ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. గతంలో తాను చేసిన దేశ్‌ముఖ్ వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. తాను సెక్యూరిటీ లేకుండా ప్రజల మధ్యకు వస్తాన ని.. బండి సంజయ్‌కి ఆ దమ్ముందా..? అని సవాల్ విసిరారు. రిజర్వేషన్లపై బీజేపీ బాగోతం బయటపెట్టడానికే కామారెడ్డిలో సభను నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని తెలిపారు. 2లక్షల మందితో కేంద్రం కనువిప్పు కలిగేలా, బీసీల భవిష్యత్తు మలుపు తిప్పే విధంగా సభ ఉంటుందన్నా రు. దోచుకున్న సొమ్ము వాటాల పంపిణీలో తేడా వచ్చి.. కేసీఆర్ కుటుంబం బజారున పడి కొట్టుకుంటోందన్నారు. కాళేశ్వరం అవినీతిని కవితనే బయటపెట్టిందని తెలిపారు. కేసీఆర్ కుటుంబమంతా దొంగల ముఠా అని, కేసీఆర్ పిలిస్తే మళ్లీ కవిత వెళ్లదా..? అని ఆయన ప్రశ్నించారు.



## సంపాదకీయం

# పాలకులే నేరస్తులైతే?



చట్టసభలంటేనే ప్రజాస్వామ్యానికి పునాదులు. ప్రజా క్షేమానికి చట్టాలు రూపొందించే కేంద్రాలు. ఇంతటి బాధ్యత గల సభల్లో సగం మంది నేర చరితులు ఉండటం ఆందోళన కలిగించే అంశం. దేశంలో దాదాపు నలభై ఏడు శాతం మంది మంత్రులు నేరారోపణలు ఎదుర్కొం టున్నారని అసోసియేషన్ ఫర్ డెమోక్రసీ రిఫార్మ్స్ (ఏడీఆర్) తన తాజా నివేదికలో పేర్కొంది. ఇది ప్రజాస్వామిక వాదులందరినీ కలవర పెడుతున్నది. ఎందుకంటే, ఈ పదకొండేండ్ల కాలంలో జరుగుతున్న పరి ణామాల్ని దేశమంతా గమనిస్తూనే ఉన్నది. నేరాలు, ఘోరాలు పెరగడం, హత్యలు, లైంగికదాడులు పెచ్చుమీరడం మనిషి భద్రతను ప్రశ్నా ర్థకం చేస్తున్నది. వీటిని అరికట్టడంలో పాలకాగణం అడుగడుగునా వైఫల్యం చెందుతోంది. ప్రజలేవారి భద్రత కోసం రోడ్లెక్కి నినదిస్తున్న దుస్థితి కనిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారూ నేరాల్లో భాగస్వాములుగా ఉన్నారంటే ఇంతకన్నా దౌర్భగ్యం ఏముంటుంది? వారు ప్రజల్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించగలరా? ఏలి కలంతా ఏదో ఓకేసులో ఆరోపణలు ఎదుర్కొం టున్నారంటే ఈనేర సంస్కృతికి వారే ఆజ్యం పోస్తున్నట్టు కాదా? ఏడిఆర్ నివేదిక అనేక విస్తుపోయే విష యాలను వెల్లడించింది. ఇరవై ఏడు రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్రమంత్రి మండలి నుంచి 643 మంది అఫిడవిట్లను పరిశీలించింది. ఇందులో చాలావరకు హత్యలు, కిడ్నాప్‌లు, మహిళలపై అఘాయిత్యాలవంటి అభియోగాలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, మం త్రులున్నారు. ఇది సిగ్గుచేటు. తెల్లారితే చాలు, మైకు పట్టుకుని మహిళలకు రక్షణగా ఉంటామని, వారి క్షేమమే ధ్యేయమని నీతులు వల్లించే నేతలు దీనికి సమాధానం చెప్పాలి. పాలక పార్టీల నేతల్లో చాలామంది ఏదో ఓ కేసులో నిందితులుగా ఉన్న వారే. దేశాన్ని పాలిస్తున్న బీజేపీ కూటమిది ఈ నేరాల్లో సింహభాగం. 336 మంత్రుల్లో 136 మందిపై క్రిమినల్ కేసులు నమోదవ్వడం దేశాన్నే నివ్వెర పరుస్తున్నది. దీన్ని బట్టి చూస్తే అవినీతి, బంధుప్రీతి, రాగద్వేషాల కతీతంగా పనిచేస్తామని నమ్మబలికిన నాయకులు అధికారాన్ని చెరబట్ట గానే నేరాల్లో పాలుపంచుకున్నట్టు తెలుస్తోంది. ఐదేండ్లు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష విధించే తీవ్రనేరారో పణలపై ప్రధాని సహా, ముఖ్య మంత్రి, మంత్రి, ప్రజా ప్రతినిధు లెవరైనా 30 రోజులు కస్టడీలో ఉన్నా వారు పదవిని కోల్పోయేలా కేంద్రం ఇటీవల పార్లమెంట్‌లో మూడు బిల్లులను సవరణకు పెట్టింది. ఇది చట్టమైతే నేరం నిర్ధారించబడకున్నా ఎవరైనా అక్కసుతో ఒక్క నెల రోజులు బయటకు రాకుండా ప్రజా ప్రతినిధిని జైల్లో నిర్భందిస్తే చాలు, పదవి పోవాల్సిందే. బీజేపీయేతర రాష్ట్రాల నేతల్ని కేసుల్లో ఇరికించి ప్రభుత్వాలను పడగొట్టే కుట్రలో భాగంగానే ఈ చట్టాన్ని ప్రవేశ పెడుతున్నట్టు ప్రతిపక్షాలు విమర్శించాయి, ఆందోళన కూడా చేశాయి. ఇందులో వాస్తవం లేకపోలేదు. ఇప్పటివరకు ప్రజాస్వామ్య బద్ధంగా, పార దర్శకంగా ఎన్నికైన రాష్ట్రాల్లో అడ్డదారుల్లో అధికారంలోకి వచ్చిన చరిత్ర బీజేపీది. ఈ 'పదవీచ్యుత' చట్టం దాన్ని మరింత బలోపేతం చేస్తుంది. నేరస్తులుగా నిర్ధారించబడినవారు, అధికారాన్నే అడ్డుగోడగా నిర్మించు కున్నవారు కాషాయ పార్టీలోనే ఎక్కువ! మరి వారందరినీ పదవినుంచి తొలగించాలి. పైగా ఈడి, సిబిఐ పేరుతో ఇతర పార్టీల్లో నేరారోపణలు ఎదుర్కొంటున్న వారందరినీ 'వాషింగ్ మిషన్'లో శుభ్ర పరుస్తున్నారు, వారి కేసులు రద్దుచేస్తున్నారు, అందలమెక్కిస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేయడమే. ఇంకా బీజేపీలో పద్నాలుగు మంది బిలియనీర్లయిన మంత్రులు ఉన్నారని ఏడీఆర్ చెబుతున్నది. ఈ డబ్బంతా అక్రమ సంపాదనే కదా! ఎంతోమంది నిర్దోషులను దోషు లుగా చిత్రీకరిస్తే వచ్చినది. పారదర్శకంగా ఉండాల్సిన పదవి అవినీతిమయం కావడం, నిస్వార్థం స్థానంలో స్వార్థ ప్రయోజనం చేరడంతో వచ్చిన ఫలితమిది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కట్టిన బ్రిడ్జిలన్నీ చాలా వరకు నాణ్యతలేమి కారణంగా కూలి పోయాయి. ఎంతో ప్రాణ నష్టం జరిగింది. దీనికి బాధ్యత కాంట్రాక్టర్లతో పాటు, వాటికి అనుమతినిచ్చిన శాఖలు, వాటి అమలుకు సంతకాలు పెట్టిన మంత్రులది. ప్రజాస్వామ్యం ముసుగులో ప్రజల్లో విద్వేషాలు రెచ్చ గొట్టడం, వారిపై దాడులకు ఉసిగొల్పడం, తద్వారా వారి చా వులకు కారణమవ్వడం కూడా క్షమించరాని నేరం. దేశంలో నేర సామ్రాజ్యం విస్తరించడానికి పాలకులు అను సరించే విధానాలూ కారణమే. వాటిని అరికట్టాలంటే జైళ్లు, శిక్షలు సరిపోవు. చట్టాలు ఎంత పకడ్బందీగా ఉన్నా అందులో చిన్న లొసుగు ద్వారా కూడా బయటపడే అవకాశముంటుంది. అందుకని ప్రజలు నేరచరితుల పట్ల అప్రమత్తంగా ఉంటేనే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలం.

## మరో బాంబ్ పేల్చిన వాతావరణ శాఖ..

# తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి




**హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ**
తెలంగాణ లేటెస్ట్ వెదర్ అప్ డేట్ వచ్చేసింది. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావం క్రమంగా పెరుగుతుండడంతో.. రాబోయే మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం తుఫాన్ బలహీనంగా ఉన్నప్పటికీ.. సోమవారం నుంచి దాని ప్రభావం పెరుగుతుందని.. మంగళ, బుధ వారాల్లో.. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, బలమైన గాలులు ఉండే అవకాశం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్‌తో పాటు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్ధిపేట, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లో గాలివానలు, ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాత్రివేళ బయటకు వెళ్లే వారు, రైతులు, వ్యవసాయ కార్మికులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 8, 9 తేదీలలో వర్షాల తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉండటంతో తక్కువ ఎత్తున్న ప్రాంతాల్లో నీరు నిలిచిపోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో వాగులు, చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అవసరమైన వైద్య సహాయం, రక్షణ చర్యలు తక్షణం అందేలా రెస్క్యూ టీమ్‌లు సిద్ధంగా ఉన్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ ముందస్తు చర్యలు చేపడుతోంది.

# ఆకాశంలో అద్భుతం

## భారత్‌లో ప్రారంభమైన సంపూర్ణ చంద్రగ్రహణం..!

**ఆదివారం రాత్రి 11 గంటలకు మొదలు**
**టెలీస్కోప్‌ల ద్వారా ఆసక్తిగా వీక్షించిన ప్రజలు**
**అవగాహన కల్పించిన నిపుణులు**






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రపంచవ్యాప్తంగా భారత్‌తో పాటు అనేక దేశాల్లో చంద్రగ్రహణం కనిపించింది. భారత్‌లో ఆదివారం రాత్రి 9.56 గంటలకు ఇది ప్రారంభమైంది. ఇక ఇదేరోజు రాత్రి 11 గంటలకు 'సంపూర్ణ చంద్రగ్రహణం' మొదలైంది. ఇది తర్వాతి రోజు (సోమవారం) ఉదయం 12.22 గంటలకు ఇదీ వీడనున్నది. అంటే 82 నిమిషాల పాటు పూర్తిగా భూమి నీడలోనే చంద్రుడు ఉండనున్నాడు. అయితే ఈ గ్రహణాన్ని బ్లడ్‌మూన్‌గా పిలుస్తున్నారు. అలాగే సోమవారం ఉదయం 2:25 గంటలకు చంద్రగ్రహణం వీడనున్నది. సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖపై వచ్చినప్పుడు ఈ చంద్ర గ్రహణం ఏర్పడుతుంది. కాగా ఈ చంద్రగ్రహణాన్ని చూసేందుకు పెద్దలు, చిన్నారులు ఆసక్తి కనబర్చారు. టెలీస్కోప్‌ల ద్వారా ఈ దృశ్యాన్ని వారు వీక్షించారు. కాగా నిపుణులు, హేతువాదులు ఈ చంద్రగ్రహణం గురించిన అసలు విషయాలను వివరిస్తూ అపోహలను తొలగించే ప్రయత్నాలు చేశారు. వారికి అవగాహనను కల్పించారు. కాగా ఆసియా, పశ్చిమ ఆస్ట్రేలియాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం.. ఐరోపా, ఆఫ్రికా, తూర్పు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పాక్షిక చంద్రగ్రహణం కనిపించింది.

# శిశు మరణాల రేటులో అత్యంత తక్కువ స్థాయికి కేరళ

**అమెరికాలో 5.6% కంటే దిగువకి కేరళలో 5% తక్కువ**



**తిరువనంతపురం ప్రజా స్వేచ్ఛ**
కేరళ రాష్ట్రంలో శిశు మరణాల రేటు ( ఐఎంఆర్ ) అత్యంత తక్కువ స్థాయికి చేరుకుంది. ప్రతి వేయి శిశ జననాలకు కేవలం 5 మరణాలు మాత్రమే నమోదవుతున్నాయని శాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ ( ఎస్ఆర్ఎస్ ) నివేధిక తెలిపింది.. ఈ రేటు అమెరికా కంటే కూడా తక్కువ. దేశ సగటు కంటే దాదాపు ఐదు రెట్లు తక్కువ. భారత్‌లో శిశు మరణాల రేటు సగటు 25% ఉండగా, కేరళలో అది కేవలం 5% మాత్రమే. అమెరికాలో ఈ రేటు 5.6% ఉండగా, కేరళ దాన్ని దాటేసింది. ఇది కేరళ వైద్య రంగంలో సాధించిన అపూర్వ విజయమని ఆ రంగ నిపుణులు తెలుపుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇదే స్థాయిలో మెరుగుదల నమోదయింది. తల్లి, పిల్లల ఆరోగ్య సేవల్లో రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధించిందని అధికారులు తెలిపారు. నవజాత శిశువుల మరణాల రేటు (నియోనేటల్ మార్టాలిటి ) కూడా 4% కంటే తక్కువకు చేరుకుంది. దేశ సగటు 18% ఉండగా, కేరళలో ఇది అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి చేరుకుంది. ఇది కేరళ వైద్య రంగం ఎంత అభివృద్ధి చెందిందో చూపిస్తుంది. ఈ విజయానికి అనేక కారణాలు ఉన్నాయి. పుట్టిన వెంటనే పిల్లలకు పూర్తి వైద్య పరిక్షలు చేయడం. అన్ని ఆసుపత్రుల్లో అత్యుత్తమ వైద్య సౌకర్యాలు, పిల్లల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక పథకాలు. గ్రామ స్థాయిలో ఆరోగ్య కార్యకర్తల చురుకైన పాత్ర వహిస్తున్నాయి. కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ అక్షరాస్యత, టీకాలు, ప్రత్యేక వైద్య కార్యక్రమాలు వంటి బహుముఖ వ్యూహంతో ఈ విజయం సాధ్యమైందని అన్నారు. పుట్టుకతో వచ్చే గుండె లోపాలను చికిత్స చేయడానికి ప్రత్యేక కార్యక్రమం నడుపుతున్నామని, కేరళ ప్రభుత్వం ఈ రేటును మరింత తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుందని, అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి చేరుకుంటామని ఆమె తెలిపారు.

# చికాగోలో చెలరేగిన నిరసనలు

**-దేశ బహిష్కరణ చేస్తానంటూ**
**ట్రంప్ సోషల్ మీడియాలో బెదిరింపులు**
**నిరసనగా హోరెత్తిన వీధులు**




**చికాగో ప్రజా స్వేచ్ఛ**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చికాగో నగరానికి నేషనల్ గార్డులను పంపి అక్రమ వలసదారులను దేశం నుండి బహిష్కరిస్తానని బెదిరింపులకు దిగారు. దీనికి వ్యతిరేకంగా శనివారం చికాగోలోని డౌన్‌టన్‌లో వేలాదిమంది వలసదారులు, న్యాయవాదులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ఆందోళనలు నగర శివారు ప్రాంతాలకు, రాజధాని వాషింగ్టన్‌కు విస్తరించాయి. హింసాత్మక నేరాల అదుపు పేరుతో 2 వేల మంది నేషనల్ గార్డులను వాషింగ్టన్‌లో మోహరించిన విషయం తెలిసిందే. ఇమ్మిగ్రేషన్ చర్యలతో మా కుటుంబాలు విడిపోతాయని, లాటిన్ కమ్యూనిటీలు లక్ష్యంగా దాడులు కొనసాగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అధ్యక్షుడి బెదిరింపులతో మెక్సికన్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిరాశగా మారాయన్నారు. ట్రంప్ సోషల్ మీడియాలో " అపోకలిప్స్ నౌ " సినిమాలోని ఆర్మీ అధికారిగా తనను తాను పోల్చుకుంటూ బెదిరించారు. అయితే ఇల్లినాయిస్ గవర్నర్ జెబి ప్రిట్జ్‌కర్ , మేయర్ బ్రాండన్ జాన్సన్ ట్రంప్ బెదిరింపులను ఖండించారు. నియంత కావాలనుకనే వారికి చికాగో బయపడదన్నారు. ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సి (ఐసిఇ) ప్రకటనతో మెక్సికన్ స్వాతంత్ర్యదిన వేడుకల్లో విషాదం అలుముకుందని, చికాగోలో కొన్ని మెక్సికన్ పండుగలు రద్దు చేసారన్నారు. ప్రభుత్వ ఇమ్మిగ్రేషన్ విధానంతో అమెరికా నష్టపోతుందని తెలిపారు. శుక్రవారం ట్రంప్ రక్షణ శాఖను యుద్ధ శాఖగా పేరు మార్చారు. ఇది ప్రపంచానికి విజయ సందేశం పంపుతుందన్నారు. అయితే ఆయన శాఖ పేరు మార్చి అమెరికా పౌరులపైనే యుద్ధం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

# నేడు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి కార్యశాల నిర్వహణ.

### సృజనాత్మక రచనలు అంశంపై కార్యశాల.



**మెదక్ ప్రజా స్వేచ్ఛ**
స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని సోమవారం రాష్ట్రస్థాయి కార్యశాలను నిర్వహించనున్నట్టు ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ హుస్సేన్ తెలిపారు. డాక్టర్ వామనమూర్తి సమన్వయకర్తగా నిర్వహించనున్న ఈ కార్యశాలకు మెదక్ లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ మల్లెగోడ గంగా ప్రసాద్ మరియు మెదక్ లోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు ఉపన్యాసకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ పద్మరాణి అతిథులుగా రానునరన్నారు.తెలుగు శాఖాధిపతి డాక్టర్ వామనమూర్తి మాట్లాడుతూ ఈ కార్యశాలలో సృజనాత్మక రచనలు, పాట మరియు వచన కవితారచన మొదలైన అంశాలలో విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఈ కార్యశాల దోహదపడుతుందని తెలిపారు. కళాశాల విద్యార్థులందరూ తప్పకుండా ఈ సదస్సుకు హాజరుకావాలని సూచించారు.

## ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.



**మెదక్ జిల్లా-ప్రజా స్వేచ్ఛ**
ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణం పూర్తయేలా పనులలో వేగం పెంచాలని కలెక్టర్ పంచాయతీరాజ్ ఇంజనీర్ ను ఆదేశించారు.. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 05 కోట్ల రూపాయల వ్యయంతో ఇందిర మహిళా శక్తి భవనాన్ని నిర్మించుకుంటున్నామని పనులు వివిధ దశలలో కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళ శక్తి భవన నిర్మాణం పనులు పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువు తేదీలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## డాక్టర్ పి. చంద్రశేఖర్ పదవీ విరమణ సన్మానం




**మెదక్ జిల్లా-ప్రజా స్వేచ్ఛ**
జిల్లా ఆసుపత్రిలో గత 25 సంవత్సరాలుగా విధులు నిర్వహించి ఇటీవలే కొండాపూర్ సూపరిడెంట్ గా వెళ్లి గత నెలలో పదవి విరమణ పొందిన డాక్టర్ పిప్పిరి.చంద్రశేఖర్ సన్మాన కార్యక్రమం ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఇఫ్కో డైరెక్టర్ యం. దేవేందర్ రెడ్డి పాల్గొని డాక్టర్ చంద్రశేఖర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సేవలతోనే గుర్తింపు ఉంటుందన్నారు,ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తేనే వారు కలకాలం గుర్తుంచుకుంటారని అన్నారు. డాక్టర్ గా మంచి గుర్తింపు తెచ్చుకున్న చంద్రశేఖర్ ప్రజలకు ఎన్నో సేవలను అందించారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్,పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కొట్టాల. విశ్వం, భీమరి కిషోర్ జయరాజ్,ఆర్ కె.శ్రీనివాస్, పట్టణ పార్టీ కో కన్వీనర్లు లింగారెడ్డి,జుబేర్ అహ్మద్, రైలు ఘనపూర్ మండల పార్టీ అధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లం టి హొటల్ ను ప్రారంభించిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి

**వనపర్తి జిల్లా ప్రజా స్వేచ్ఛ**
వనపర్తి పట్టణంలో 19 వ వార్డు గాంధీనగర్ కు చెందిన మండ్ల లోకేష్ ఆహ్వాన మేరకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పాల్గొని ఎస్టీ తామస్ హై స్కూల్ ముందు ఏర్పాటుచేసిన బెల్లం టీ హొటల్ ను ప్రారంభించారు యువత అన్ని రంగాల్లో ముందుకు వెళ్లి ఆర్థికంగా బలోపేతం కావాలని అంటే పట్టుదలతో సాధిస్తే ఆర్థికంగా ఎదగడానికి యువత అన్ని రంగాల్లో ముందుకు వెళ్లి మంచి విజయాలు సాధిస్తారని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బిల్లుకు కేంద్రం అడ్డు

-కేసీఆర్ కుటుంబమంతా దొంగల ముఠానే
-ఆయన పిలిస్తే కవిత వెళ్లదా?: మహేశ్‌గౌడ్
-విపక్షాల కుట్రలు వెల్లడిస్తాం: పొంగులేటి
-బీసీల కోసం రాహుల్ పోరాటం: సీతక్క
-కేంద్రం మెడలు వంచుతాం: సురేఖ



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి





**కామారెడ్డి, ప్రజా స్వేచ్ఛ**
గవర్నర్ వద్ద బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు చట్టబద్ధత కల్పించకుండా బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కేంద్రం తలచుకుంటే ఒక్క రోజులోనే రిజర్వేషన్లపై చట్టం తీసుకురావచ్చని.. కానీ కాంగ్రెసకు ఎక్కడ పేరు వస్తుందోననే భయంతో అడ్డుకుంటోందన్నారు. కామారెడ్డిలో ఈ నెల 15న నిర్వహించనున్న బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ సన్నాహక సమావేశం ఆదివారం కామారెడ్డిలోని శుభం కన్వెన్షన్‌లో జరిగింది. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్.. ప్రధాని మోదీ, అమిత్‌షాలను ఒప్పించకపోవడం సిగ్గు చేటన్నారు. బీసీ బిడ్డలైన సంజయ్, ఎంపీ అర్వింద్ బిల్లుపై ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. గతంలో తాను చేసిన దేశ్‌ముఖ్ వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. తాను సెక్యూరిటీ లేకుండా ప్రజల మధ్యకు వస్తాన ని.. బండి సంజయ్‌కి ఆ దమ్ముందా..? అని సవాల్ విసిరారు. రిజర్వేషన్లపై బీజేపీ బాగోతం బయటపెట్టడానికే కామారెడ్డిలో సభను నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని తెలిపారు. 2లక్షల మందితో కేంద్రం కనువిప్పు కలిగేలా, బీసీల భవిష్యత్తు మలుపు తిప్పే విధంగా సభ ఉంటుందన్నా రు. దోచుకున్న సొమ్ము వాటాల పంపిణీలో తేడా వచ్చి.. కేసీఆర్ కుటుంబం బజారున పడి కొట్టుకుంటోందన్నారు. కాళేశ్వరం అవినీతిని కవితనే బయటపెట్టిందని తెలిపారు. కేసీఆర్ కుటుంబమంతా దొంగల ముఠా అని, కేసీఆర్ పిలిస్తే మళ్లీ కవిత వెళ్లదా..? అని ఆయన ప్రశ్నించారు.

# ప్రశాంతంగా ముగిసిన వినాయక నిమజ్జనోత్సవాలు..

-ప్రశాంతంగా జరగడానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినంధించిన - జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు



**మెదక్ జిల్లా-ప్రజా స్వేచ్ఛ**
మెదక్ జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా ముగిశాయని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు.గడచిన 11 రోజులపాటు జిల్లా అంతటా పోలీస్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో 24 గంటలు అప్రమత్తంగా పనిచేయడంతో అన్ని మండలాలు, గ్రామాలు, పట్టణాల్లో వినాయక ఉత్సవాలు సజావుగా జరిగాయని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, నిమజ్జన ఘాట్‌ల వద్ద ప్రత్యేక పికేట్లు సమర్థవంతంగా పనిచేశాయని తెలిపారు.ఉత్సవాల విజయవంతానికి సమన్వయంగా పనిచేసిన రెవెన్యూ, మున్సిపల్,ఆరోగ్య, విద్యుత్ తదితర శాఖల అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అన్ని శాఖల సిబ్బంది సమిష్టిగా కృషి చేయడం వల్ల నిమజ్జన ప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని అన్నారు.అలాగే వినాయక మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు, సభ్యులు సహకరించడంతో పాటు కులమతాలకు అతీతంగా ప్రజలు ఎంతో సోదర భావంతో, ఆనందోత్సాహాలలో పాల్గొనడం ఐక్యతకు నిదర్శనమని ఎస్పీ అభినందించారు. ప్రజలు స్వచ్ఛందంగా పోలీసులు ఇచ్చిన సూచనలు పాటించడం కూడా ప్రశాంత వాతావరణానికి కారణమైందని ఆయన అన్నారు.నిమజ్జనోత్సవాల సందర్భంలో విధులు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందిస్తూ, క్షేత్రస్థాయిలో పనిచేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాలు విజయవంతంగా ముగియడానికి సమిష్టి కృషి ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు ముగియడం మెదక్ పోలీస్ యంత్రాంగం కృషికి ప్రతీక అని ఎస్పీ వెల్లడించారు.

## చంద్రగ్రహణం ఎఫెక్ట్ దర్శనాలు నిలిపివేత

### నేడు యథావిధిగా దర్శనాలు...



**పాపన్నపేట,-ప్రజా స్వేచ్ఛ**
సంపూర్ణ చంద్రగ్రహణం పురస్కరించుకొని మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల దేవస్థానం రాజగోపురంలో ప్రతిష్టించిన వన దుర్గ మాత అమ్మవారి దర్శనాలు నిలిపివేసిన అధికారులు. ఆదివారం చంద్రగ్రహణం పురస్కరించుకొని మధ్యాహ్నం ఆలయ అర్చకులు అమ్మవారికి వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆలయ అధికారులు భక్తులకు అమ్మవారి దర్శనాలు నిలిపివేశారు. నేడు సోమవారం తెల్లవారు జామున 6 గంటలకు అమ్మవారిని తెరిచిన వెంట నే సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి యథావిధిగా అభిషేకం, అలంకరణ,నిత్య పూజలు, భక్తులకు దర్శనం కల్పించడం జరుగుతుందని తెలిపారు.

## నూతనంగా ఎన్నికైన కొత్తకోట గౌడ సంఘం

### -సన్మనించిన బీసం చెన్నకేశవరెడ్డి ఉమ్మడి జిల్లా సీడీసీ మాజీ చైర్మన్



**వనపర్తి ప్రజా స్వేచ్ఛ**
కొత్తకోట పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నికైన కొత్తకోట పట్టణ గౌడ సంఘం అధ్యక్షులు జి.వెంకటన్న గౌడ్ కి,గౌడ సంఘం ఉపాధ్యక్షులు ఎల్ఐసి కృష్ణ గౌడ్ ని,గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి నరేష్ గౌడ్ ని,శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన ఉమ్మడి పాలమూరు జిల్లా సిడిసి మాజీ చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి కొత్తకోట మున్సిపాలిటీ 11వ వార్డు ఇన్చార్జ్ నారమన్ అయ్యగారు,బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు పసుపుల నెహ్రూ,బిఆర్ఎస్ యువ నాయకులు మంద ప్రశాంత్,పట్టణ యువత అధ్యక్షులు రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం

### కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాటం



**కమాన్‌పూర్ ప్రజా స్వేచ్ఛ**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తాటికొండ శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమాన్‌పూర్ మండలంలోని పేరపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల గ్రామాలకు నిధులు రాక అభివృద్ధి కుంటుపడిందని తాటికొండ శంకర్ ఆరోపించారు. వీధిలైట్లు వంటి ప్రాథమిక అవసరాలకు కూడా నిధుల కొరత ఏర్పడిందని, రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు.గతంలో పుట్ట మధు నాయకత్వంలో మంథని నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కదిరే రాములు యాదవ్,జంపన్న యాదవ్ లనుపరామర్శించినడాక్టర్ జిల్లెల.ఆదిత్య రెడ్డి





**ప్రజా స్వేచ్ఛ వనపర్తి జిల్లా ప్రతినిధి.**

వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు యాదవ్,మాజీ కౌన్సిలర్ కదిరే జంపన్న గారి తల్లి కదిరే నాగమ్మ చనిపోయిన విషయం తెలుసుకున్న వనపర్తి నియోజకవర్గ యువ నాయకులు,ఏఐపిసి నేషనల్ హెడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ డా.జి. ఆదిత్య రెడ్డి, వారి కుటుంబాన్ని పరామర్శించారు.కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరం ఆ బాధ నుంచి కోలుకొని ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎం.దేవన్న యాదవ్,వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియాకో కోఆర్డినేటర్ గడ్డం వినోద్ యాదవ్,వనపర్తి మండల్ న్ ఎన్ఎస్ యుఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్,పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

## మూసీ పునరుజ్జీవానికి శ్రీకారం

**-రూ.7,658 కోట్లతో గోదావరి తాగునీటి ప్రాజెక్టు ఫేజ్-2,**
**3 పథకాలకు నేడు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి**
**-మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీల నీటి తరలింపు**
**-మూసీకి 2.5.. హైదరాబాద్ తాగునీటికి 17.5 టీఎంసీలు**
**-ఓఆర్ఆర్ ఫేజ్-2 తాగునీటి సరఫరానూ ప్రారంభించనున్న సీఎం**







తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన కలల ప్రాజెక్టుగా చేపట్టిన మూసీ పునరుజ్జీవ పనులకు సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా రూ.7,360 కోట్లతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చెరువులను మంచినీటితో నింపేందుకు ఉద్దేశించిన గోదావరి తాగునీటి ప్రాజెక్టు ఫేజ్-2, 3 పథకాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. దీంతోపాటు ఓఆర్ఆర్ ఫేజ్-2లోని ప్రాంతాలకు తాగునీటి స రఫరా కోసం చేపట్టిన ప్రాజెక్టులో నిర్మించిన 15 కొత్త రిజర్వాయర్లను ప్రారంభించనున్నారు. కాగా, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) విధానంలో చేపడుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం 40 శాతం పెట్టుబడి పెట్టనుండగా, కాంట్రాక్టు సంస్థ 60 శాతం నిధులను సమకూర్చుకోనుంది. పనులు ప్రారంభమైన తరువాత నుంచి రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి 20 టీఎంసీల నీటిని తరలిస్తారు. వీటిలో మూసీ పునరుజ్జీవానికి 2.5 టీఎంసీల నీటిని కేటాయించి.. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలను నింపనున్నారు. మిగతా 17.5 టీఎంసీలను హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారు. నీటి తరలింపు మార్గం మధ్యలో ఉన్న 7 చెరువులను కూడా నింపుతారు. 2027 డిసెంబరు నాటికి హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చేందుకు, ప్రతిరోజూ నల్లా నీటిని సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టును ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది.

### 15 రిజర్వాయర్ల ప్రారంభం..

ఓఆర్ఆర్ ఫేజ్-2లో భాగంగా జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలోని మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్లు, గ్రామపంచాయతీలకు తాగునీటి సరఫరా కోసం రూ.1,200 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు ఇప్పటికే పూర్తయింది. ఈ ప్రాజెక్టులో మొత్తం 71 రిజర్వాయర్లను నిర్మించగా.. వీటిలో 15 కొత్త రిజర్వాయర్లను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. వీటి ద్వారా సరూర్‌నగర్, మహేశ్వరం, శంషాబాద్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఘట్‌కేసర్, కీసర, రాజేంద్రనగర్, షామీర్‌పేట, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఆర్‌సీ పురం, పటాన్‌చెరు, బొల్లారం సహా 14 మండల్లాల్లోని 25 లక్షల మందికి తాగునీరు అందనుంది. మరోవైపు కోకాపేట లేఅవుట్ సమగ్ర అభివృద్ధిలో భాగంగా నియోపోలిస్ సెజ్‌కు తాగునీరు, మురుగునీటి వ్యవస్థ అభివృద్ధి కోసం రూ.298 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టుకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిద్వారా దాదాపు 13 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది

## సత్యం కమిటీ గణపతి లడ్డును కైవసం చేసుకున్న శివకుమార్ నాయక్



**ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్ ప్రతినిధి**

మేడ్చల్ నియోజకవర్గం పోచారం మున్సిపాలిటీ పరిధి రాజీవ్ గృహకల్పలోని సత్యం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాగణపతి నవరాత్రులు పూజలు అందుకున్న లడ్డును మౌనిక శివకుమార్ నాయక్ దంపతులు 22 వేల రూపాయలకు వేలం పాట పాడి దక్కించుకున్నారు.ఈ సందర్భంగా శివకుమార్ నాయక్ మాట్లాడుతూ విఘ్నాలు తొలగించే విగ్నేశ్వరుని లడ్డు మాకు దక్కడం చాలా సంతోషంగా ఉందని నవరాత్రులు ఎంతో నిష్టతో పూజలు అందుకున్న ఈ లడ్డు ప్రసాదాన్ని మా కుటుంబ సభ్యులతో పాటు బంధువులకు కాలనీ వాసులకు భక్తులకు పంచుతామని ఆయన అన్నారు.

## అంగరంగ వైభవంగా అంబేద్కర్ యూత్ అసోసియేషన్ మహాగణపతి శోభయాత్ర

**60 వేల రూపాయలతో గణపతి లడ్డును కైవసం చేసుకున్న పల్లెర్ల సాయికుమార్**
**-20 వేల రూపాయలతో పూలు పల్లు తీసుకున్న నల్లోల్ల జయంత్ కుమార్**



**ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్ ప్రతినిధి**

మేడ్చల్ నియోజకవర్గం పోచారం మున్సిపాలిటీ అన్నోజి గూడలోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడు అత్యంత భక్తిశ్రద్ధలతో నవరాత్రులు పూజలు అందుకుని శనివారం రోజు సాయంత్రం గంగమ్మ ఒడికి చేరుకున్నారు.నవరాత్రులు పూజలు అందుకున్న మహాగణపతి చేతిలోనీ లడ్డు ప్రసాదాన్ని 60 వేల రూపాయలకు వేలం పాట పాడి కైవసం చేసుకున్న పల్లెర్ల సాయికుమార్ అదేవిధంగా పూలు పళ్ళు 20వేల రూపాయలకు తీసుకున్న నల్లోల్ల జయంత్ కుమార్ ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ విగ్నేశ్వరుని లడ్డును పూలు పళ్ళను స్వామివారి మహా ప్రసాదంగా తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు గాంధారి నవీన్ కుమార్,కమిటి సభ్యులు రాజు,ప్రభు,శ్రీశైలం, సాయికుమార్,అజయ్,అక్షయ్, మహిత్,సుభాష్, విష్ణు,వినయ్,సోను సాయి,వేణు లతోపాటు కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వర స్వామి లడ్డు ప్రసాదం భారీగావేలం పాట 3,52,000 నాగేశ్వర్ గౌడ్ కైవసం



**ప్రజా స్వేచ్ఛ**
**శేరిలింగంపల్లి ప్రతినిధి(అశోక్)**

మియాపూర్ యూత్ అసోసియేషన్ అద్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మియాపూర్ వాస్తవ్యులు, ఓ బి సి అధ్యక్షుడు రంగారెడ్డి జిల్లా అర్బన్ రాచమల్ల నాగేశ్వర్ గౌడ్ లడ్డు వేలం పాటలో 3,52,000/- రూపాయలకు దకించుకున్నారు.లడ్డూ ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ చేతుల మీదుగా అందుకొన్నారు. మరోక లడ్డూ లక్కీ డ్రా లో కలల్ శుభాన్ గౌడ్ కి రావటం జరిగింది.ఈ కార్యక్రమంలో బండారు రాంచందర్ ముధిరాజ్,రాచమల్ల వెంకటేష్ గౌడ్, వీరమల్ల వీరేందర్ గౌడ్, బండారు అశోక్ ముధిరాజ్, రాచమల్ల కృష్ణ గౌడ్, వీరమల్ల ప్రవీణ్ గౌడ్, వీరమల్ల ప్రశాంత్ గౌడ్, తాండ్ర రాజు గౌడ్, లక్ష్మీనారాయణ ముధిరాజ్,బండారు గోపాల్ ముధిరాజ్,రాచమల్ల భాస్కర్ గౌడ్,యెల్లంకి శ్రీనివాస్ గౌడ్, ఎలియాస్ షరీఫ్,బందరు మోహన్ ముధిరాజ్,బండారు మహేందర్ ముధిరాజ్, తాండ్ర రాంచందర్ గౌడ్,మన్నె సురేష్ ముధిరాజ్, మన్నె విజయ్ ముధిరాజ్, బండారు శ్రీనివాస్ ముధిరాజ్, కందికొండ శ్రీనివాస గౌడ్,తాండ్ర శంకర్ గౌడ్,తాండ్ర రమేష్ గౌడ్, మునికొండ రాజు,శ్రీశైలం ముధిరాజ్, మన్నె నరేందర్ ముధిరాజ్, తధితరులు పాల్గొన్నారు.

## ఫరూక్ నగర్ మండల రైతులకు వ్యవసాయ శాఖ యూరియ సరఫరా

**ప్రజా స్వేచ్ఛ షాద్ నగర్ ప్రతినిధి**

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రాధమిక వ్యవసాయ సహకార కేంద్రాల అద్వర్యంలో షారూక్ నగర్ మండలంలో 5 (ఏలికట్ట రైతు వేదిక,వెల్ జర్ల రైతు వేదిక ,బూర్గుల రైతు వేదిక ,మధురాపూర్ రైతు వేదిక ,చించోడు రైతువేదిక )రైతు వేదికలలో తాత్కాలిక యూరియా పంపిణి కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది సోమవారం నాడు యూరియా కోసం 6 సెప్టెంబర్2025 తేదీ వరకు టోకెన్లు తీసుకున్న రైతులు 08 సెప్టెంబర్ 2025 సోమవారం నాడు టోకెన్,రైతు యొక్క ఒరిజినల్ పట్టా పాసు బుక్, ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకొని రైతు వేదిక క్లస్టర్ గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన ఈ క్రింద తెలిపిన యూరియా పంపిణి కేంద్రాలకు వెళ్లి యూరియా తీసుకోగలరు 1.ఎలికట్ట రైతు వేదిక లోకి 200 బస్తాల యూరియా అందుబాటులో ఉంచబడును ఫరూక్ నగర్ క్లస్టర్ పరిధి లో గల ఫరూఖ్ నగర్,ఎలికట్ట, మొగిలిగిద్ద,ఎల్లంపల్లి, నాగులపల్లి,హాజిపల్లి, గుండ్లకుంట,కిషన్ నగర్ రెవెన్యూ గ్రామాల్లో భూమి గల రైతుల రావలసిందిగా మనవి.

2.వెలిజర్ల రైతు వేదికలోకి 200 బస్తాల యూరియాను అందుబాటులో ఉంచడం జరుగుతుంది కావున



వెలజర్ల క్లస్టర్ పరిధిలోని వెలిజర్ల, సూర్యరావుగూడ, కొండన్నగూడ,కొంగగూడ, చటాన్ పల్లి,బుచ్చిగూడ, దూసకల్ రెవెన్యూ గ్రామాల్లో భూములు గల రైతులు రావలసిందిగా తెలిపారు

3.చించోడు రైతు వేదికకు 200 బస్తాల యూరియాను అందుబాటులో ఉంచడం జరుగుతుంది చించోడ్ క్లస్టర్ పరిధిలోని చించోడు,చౌల్లపల్లి భీమారం,కంసాన్పల్లి, కందివనం రెవెన్యూ గ్రామాలలో భూములు గల రైతులు రావాల్సిందిగా కోరారు

4.షాద్ నగర్ సొసైటీ (పి ఏ సి ఎస్)కి 400 బస్తాల యూరియాను అందుబాటులో ఉంచడం జరుగుతుంది బూర్గుల క్లస్టర్(బూర్గుల, తిమ్మాజి పల్లి,అన్నారం, జోగమ్మ గూడా,రాయికల్ , విటియాల)మధురాపూర్ క్లస్టర్ (మధురాపూర్ శేరిగూడ గంట్లవెల్లి కమ్మదనం చిలకమర్రి సోలిపూర్ రామకృష్ణాపూర్) రెవెన్యూ గ్రామాల్లో భూములు గల రైతులు రావాల్సిందిగా

గమనిక:06సెప్టెంబర్ 2025 తారీకు వరకు ఉన్న టోకెన్లు ఉన్న రైతులు మాత్రమే 08 సెప్టెంబర్ 2025 సోమవారం నాడు పైన తెలిపిన క్లస్టర్ గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన యూరియా పంపిణీ కేంద్రాలకు రాగలరు యూరియా పంపిణి కేంద్రాలకు,క్లస్టర్ గ్రామాలకు సంబంచిన ఏమైనా సందేహాలు ఉంటె మీ యొక్క క్లస్టర్ గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ)ని సంప్రదించాలని వ్యవసాయశాఖ అధికారి షారూక్ నగర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## చంద్రగ్రహణం అనంతరం పండితుల సూచనలు

### విజ్ఞాన వేదిక భిన్నాభిప్రాయం

**వనపర్తి, ప్రజా స్వేచ్ఛ**

ఈ రాత్రి ఏర్పడే చంద్రగ్రహణం నేపథ్యంలో రేపు ఉదయం చేయవలసిన ఆచారాలపై పండితులు సూచనలు ఇచ్చారు. సాంప్రదాయ పద్ధతిలో గ్రహణం ముగిసిన తరువాత స్నానం చేయడం, గృహంలో శుద్ధి కోసం గోమయం లేదా గంగాజలంతో ప్రక్షాళన చేయడం, పుణ్య స్నానం చేసి దానం చేయడం మేలని వారు తెలిపారు.అయితే, జన విజ్ఞాన వేదిక మాత్రం గ్రహణాలకు మతపరమైన లేదా శాస్త్రీయ కారణం లేదని, ఇది సహజ ఖగోళ పరిణామమని పేర్కొంది. గ్రహణం ముగిసిన తరువాత ప్రత్యేక ఆచారాలు పాటించాల్సిన అవసరం లేదని, ప్రజలు విజ్ఞానాన్ని నమ్మాలని విజ్ఞప్తి చేసింది.

## బిజినెస్

# రాబోయే ఐదేళ్లలో తులం బంగారం ధర ఎంత పెరుగుతుందో తెలుసా?

### షాకింగ్ సమాచారం!



భారతదేశంలో బంగారం ధర రోజురోజుకూ విపరీతంగా పెరుగుతుండడంతో ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారు. ప్రస్తుత బంగారం ధర ఆకాశాన్నంటుతుండగా, భవిష్యత్తులో బంగారం ధర ఎలా ఉంటుందో అనే భయం నెలకొంది. ఈ పరిస్థితిలో రాబోయే ఐదు సంవత్సరాలలో అంటే 2030లో బంగారం ధర ఎలా ఉంటుందో నిపుణులు తమ అంచనాలను ఇచ్చారు. ఈ పరిస్థితిలో రాబోయే ఐదు సంవత్సరాలలో బంగారం ధర ఎలా ఉంటుందో నిపుణుల అంచనాలను వివరంగా పరిశీలిద్దాం. 2025 ప్రారంభం నుంచి బంగారం ధర క్రమంగా పెరుగుతోంది. ఈ ఏడాది మాత్రమే బంగారం ధర దాదాపు 30 శాతం పెరిగిందని చెబుతున్నారు. 2025 మధ్య నాటికి ఒక గ్రాము 22 క్యారెట్ల బంగారం ధర రూ. 10,000 దాటుతుందని ఆర్థికవేత్తలు హెచ్చరించారు. అంటే తులం ధర లక్షా రూపాయలు దాటేసింది. అదేవిధంగా ప్రస్తుతం ఒక గ్రాము బంగారం ధర రూ. 10,000 కంటే ఎక్కువ ధరకు అమ్ముడవుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే ఐదేళ్లలో బంగారం ధర చాలా రెట్లు పెరుగుతుందని చెబుతున్నారు నిపుణులు. ఈ పరిస్థితిలో ఆగస్టు 6, 2025న బంగారం ధర ఒక్కసారిగా పెరిగి, గ్రాముకు రూ. 10,005 చేరుకుంది. రాబోయే ఐదు సంవత్సరాలలో అంటే 2030 నాటికి 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 2 లక్షల వరకు పెరుగుతుందని ఆర్థికవేత్తలు అంచనా వేశారు..

# బంపర్ ఆఫర్..

**మారుతి వ్యాగన్‌ఆర్ రూ.60,000 వరకు తగ్గింపు.. కారు ధర ఎంతో తెలుసా?**



మీరు రాబోయే కాలంలో కొత్త హ్యాచ్‌బ్యాక్ కొనాలని ప్లాన్ చేస్తుంటే మారుతి సుజుకి వ్యాగన్‌ఆర్ మీకు మంచి ఎంపిక కావచ్చు. ఈ నెలలో అంటే సెప్టెంబర్ 2025 నాటికి దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న హ్యాచ్‌బ్యాక్ మారుతి సుజుకి వ్యాగన్‌ఆర్ పై కంపెనీ రూ.60 వేల వరకు తగ్గింపును అందిస్తోంది. మారుతి వ్యాగన్‌ఆర్ పై ఈ ఆఫర్ లో రూ.45,000 వరకు వినియోగదారుల తగ్గింపు, రూ.15,000 వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ ఉన్నాయి. డిస్కౌంట్ కోసం మీరు సమీపంలోని డీలర్‌షిప్‌ను సంప్రదించవచ్చు. మారుతి వ్యాగన్‌ఆర్ ఫీచర్లు, ధర, పవర్‌ట్రెయిన్ గురించి తెలుసుకుందాం.

**మారుతి వాగన్‌ఆర్ ఆన్-రోడ్ ధర ఎంత?**


మారుతి వ్యాగన్‌ఆర్ ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర రూ. 5.78 లక్షల నుండి ప్రారంభమై రూ. 7.62 లక్షల వరకు ఉంటుంది. దీని బేస్ వేరియంట్‌ను ఢిల్లీలో కొనుగోలు చేస్తే దాదాపు రూ. 24 వేల రిజిస్ట్రేషన్‌తో పాటు దాదాపు రూ. 22 వేలు బీమా కోసం చెల్లించాల్సి ఉంటుంది. దీనితో పాటు ఇతర ఛార్జీలుగా రూ. 5685 చెల్లించాల్సి ఉంటుంది. దీని తర్వాత దాని ఆన్-రోడ్ ధర రూ. 6.30 లక్షలు అవుతుంది.

**మారుతి వ్యాగన్‌ఆర్ పవర్ ట్రైన్:**

మారుతి వ్యాగన్‌ఆర్ మూడు ఇంజన్ ఆప్షన్‌లను కలిగి ఉంది. 1.0 లీటర్ పెట్రోల్, 1.2 లీటర్ పెట్రోల్, 1.0 లీటర్ పెట్రోల్ +CNG . దీని పెట్రోల్ వెర్షన్ లీటరుకు 25.19 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుంది. అయితే CNG వెర్షన్ 34.05 కి.మీ/కి.మీ వరకు మైలేజీని ఇవ్వగలదు. ఇందులో మాన్యువల్, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఎంపికలు రెండూ అందుబాటులో ఉన్నాయి. అందుకే ఈ కారును నగరంలో, హైవేపై సౌకర్యవంతంగా నడపవచ్చు .

# బాబోయ్.. 6 నెలల్లో మల్టీబ్యాగర్‌కే మెంటలెక్కించిన పెన్నీ స్టాక్.

### లక్ష పెట్టుబడితో చేతికి రూ. 3.10 లక్షలు



భారత స్టాక్ మార్కెట్లు వరుస లాభాల తర్వాత శుక్రవారం మధ్యాహ్నం యూ టర్న్ తీసుకున్నాయి. గతవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల నేపథ్యంలో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాయి. ఆ తర్వాత జీఎస్టీ సంస్కరణలతో భారీగా లాభాలు అందుకున్నాయి. ఇక చివరకు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపగా.. షేర్లలో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. దీంతో చివరకు నష్టాల్లోనే ముగిశాయిమార్కెట్ల లాభనష్టాలతో సంబంధం లేకుండా ఒక స్టాక్ విపరీతంగా ఆకట్టుకుటోంది. రోజురోజుకూ అప్పర్ సర్క్యూట్ చేరుతూ ఇన్వెస్టర్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. అదే అవాన్స్ టెక్నాలజీస్ లిమిటెడ్. ఈ మల్టీబ్యాగర్ పెన్నీ స్టాక్ ఏకంగా 39వ సెషన్‌లోనూ అప్పర్ సర్క్యూట్ తాకింది. ఈ క్రమంలో ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర (రూ. 1.98) చేరడం గమనార్హం. కాగా, 52 వారాల కనిష్ట ధర రూ. 0.52 వద్ద ఉంది. ఇక మార్కెట్ విలువ రూ. 386.38 కోట్లుగా ఉంది. భారత స్టాక్ మార్కెట్‌లో అవాన్స్ టెక్నాలజీస్ షేర్ ధర అసాధారణమైన పెరుగుదలను నమోదు చేస్తోంది. ఇది వరుసగా 39 ట్రేడింగ్ సెషన్ల పాటు అప్పర్ సర్క్యూట్‌ను తాకి, పెట్టుబడిదారులకు కాసుల వర్షం కురిపించింది. ఈ షేర్ కేవలం ఆరు నెలల కాలంలోనే లక్ష రూపాయలను రూ. 3.10 లక్షలుగా మార్చింది. అంటే, గత 6 నెలల కాలంలో ఏకంగా 209 శాతం పెరిగింది. గత 5 ఏళ్ల వ్యవధిలో ఏకంగా 3800 శాతానికిపైగా పెరిగింది. అంటే రూ. 1 లక్ష పెట్టిన వారికి రూ. 39 లక్షల లాభం తెచ్చిపెట్టింది. ఈ అద్భుతమైన వృద్ధి వెనుక ఉన్న కారణాలు, సంస్థ భవిష్యత్తుపై విశ్లేషణ ఇక్కడ తెలుసుకుందాం. సాధారణంగా ఒక పెన్నీ స్టాక్ (తక్కువ ధర గల షేర్) ఇలాంటి అద్భుతమైన ప్రదర్శన కనబరచడం అరుదు. అవాన్స్ టెక్నాలజీస్ షేర్ ధర ఇంతలా పెరగడానికి ప్రధాన కారణం, సంస్థ చేపట్టిన వ్యూహాత్మక చర్యలు. ముఖ్యంగా, 'ఎక్సెస్2సెల్.కామ్' అనే బి2బి ఇన్వెంటరీ లిక్విడేషన్ మార్కెట్‌ప్లేస్‌ను కొనుగోలు చేసేందుకు సంకేతాలు ఇవ్వడమే ఈ ర్యాలీకి ఊతమిచ్చింది. ఈ ప్రకటన కంపెనీ వ్యాపారంలో కొత్త వృద్ధి అవకాశాలను తెరిచింది.

# మళ్లీ టీ20 జట్టులో సామ్ కరన్..

## స్పోర్ట్స్

### డేంజరస్ ఓపెనర్‌కు చుక్కెదురు..!



సొంతగడ్డపై వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా చేతిలో కంగుతిన్న ఇంగ్లండ్ టీ20 సిరీస్‌లో విజయమే లక్ష్యంగా పెట్టుకుంది. తమకు అచ్చొచ్చిన పొట్టి ఫార్మాట్‌లో సఫారీలకు చెక్ పెట్టాలనుకుంటోంది ఆతిథ్య జట్టు. అందుకే.. మ్యాచ్ విన్నర్ అయిన సామ్ కరన్ ను స్క్వాడ్‌లోకి తీసుకున్నారు సెలెక్టర్లు. టీ20 వరల్డ్ కప్ తర్వాత ఫామ్ కోల్పోయిన కరన్.. ఈమధ్యే 'ది హండ్రెడ్ లీగ్'లో గొప్పగా రాణించడంతో ఎంపిక చేశారు. అయితే.. ఈ మెగా టోర్నీలో దారుణంగా విఫలమైన ఓపెనర్ బెన్ డకెట్‌ను పక్కన పెట్టేశారు. దక్షిణాఫ్రికాతో పొట్టి సిరీస్‌కు హ్యారీ బ్రూక్ సారథిగా 16 మందితో కూడిన బృందాన్ని ప్రకటించింది ఇంగ్లండ్ బోర్డు. ఇందులో జోస్ బట్లర్, జోఫ్రా ఆర్చర్ వంటి సీనియర్లు ఉండగా.. బెన్ డకెట్‌కు మాత్రం చోటు దక్కలేదు. త్వరలోనే న్యూజిలండ్ పర్యటన, యాషెస్ సిరీస్‌ను దృష్టిలో ఉంచుకొని అతడికి సెలెక్టర్లు విశ్రాంతినిచ్చారు. ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాల మధ్య మూడు టీ20 సిరీస్ సెప్టెంబర్ 10న ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 12న రెండో మ్యాచ్, సెప్టెంబర్ 14న మూడో మ్యాచ్ జరుగనున్నాయి. ఐర్లాండ్‌తో జరుగబోయే టీ20 సిరీస్‌కు జాకబ్ బెథెల్ కెప్టెన్‌గా ఎంపికైన విషయం తెలిసిందే.

**దక్షిణాఫ్రికా సిరీస్ కోసం :** హ్యారీ బ్రూక్(కెప్టెన్), రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, టామ్ బాంటన్, జాకబ్ బెథెల్, జోస్ బట్లర్, బ్రాండన్ కార్సే, సామ్ కరన్, లియాం డాసన్, విల్ జాక్స్, సకీబ్ మహమ్మద్, జేమీ ఓవర్టన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, జేమీ స్మిత్, ల్యూక్ వుడ్.

**ఐర్లాండ్ సిరీస్ కోసం :** జాకబ్ బెథెల్(కెప్టెన్), రెహాన్ అహ్మద్, టామ్ బాంటన్, జోస్ బట్లర్, సామ్ కరన్, లియాం డాసన్, విల్ జాక్స్, సకీబ్ మహ్మూద్, జేమీ ఓవర్టన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, ల్యూక్ వుడ్, జోర్డాన్ కాక్స్, సోని బేకర్, టామ్ హర్ట్లే.

# ఆరోజు నేను 'ఉపవాసం'.. యినా పాకిస్థాన్‌పై సెంచరీతో చెలరేగాను..!



ప్రపంచ క్రికెట్‌లో భారత్, పాకిస్థాన్ మ్యాచ్ అంటే ఫ్యాన్స్ ఎక్కడలేని ఆసక్తి చూపిస్తారు. అందుకే దాయదుల పోరుకోసం కళ్లలో వొత్తులు వేసుకొని ఎదురుచూస్తారు అభిమానులు. ఇక చిరాకాల ప్రత్యర్థిపై వీరావేశంతో ఆడుతుంటారు టీమిండియా క్రికెటర్లు. సచిన్ టెండూల్కర్ నుంచి విరాట్ కోహ్లీ వరకూ పాక్‌పై రెచ్చిపోయిన ఆడిన ఆటగాళ్లను చూశాం. వీళ్లలో వీరేంద్ర సెహ్వాగ్ కూడా ఒకరు. అది కూడా ఉపవాసం ఉంటూనే శత్రుదేశంపై వీరూ విధ్వంసక సెంచరీతో చెలరేగాడు. దాదాపు పదిహేడేళ్ల క్రితం నాటి మ్యాచ్‌ను గుర్తు చేసుకున్న ఈ మాజీ ఓపెనర్ ఏం చెప్పాడంటే..?భారత జట్టు చివరిసారిగా 2008లో పాకిస్థాన్ పర్యటనకు వెళ్లింది. కరాచీలో జరిగిన వన్డే మ్యాచ్‌లో ప్రత్యర్థి నిర్దేశించిన 302 పరుగుల ఛేదనలో సెహ్వాగ్ విశ్వరూపం చూపించాడు. దూకుడుకు కేరాఫ్ అయిన వీరూ పాక్ ప్రధాన బౌలర్లను ఊచకోత కోస్తూ స్కోర్‌బోర్డును ఉరికించాడు. కేవలం 95 బంతుల్లోనే 119 రన్స్ బాది జట్టు విజయానికి బాటలు వేశాడు. అయితే.. ఆ మ్యాచ్ రోజున సెహ్వాగ్ ఉపవాసం ఉన్నాడట. ఈ విషయం ఇప్పటివరకూ అతడు చెబితేగానీ ఎవరికీ తెలియదు. 'అవును.. ఆరోజు నేను ఉపవాసం ఉన్నాను. ఖాళీ కడుపుతోనే బ్యాటింగ్‌కు వెళ్లాను. నా ఆకలి తీరాలంటే ఎక్కువ రన్స్ చేయాలి అనుకున్నాను. అనుకున్నట్టే జట్టు విజయానికి తోడ్పడే ఇన్నింగ్స్ ఆడాను' అని గుర్తు చేసుకున్నాడీ నజఫ‌గఢ్ నవాబ్. ఆ మ్యాచ్‌లో 125.6 స్ట్రయిక్ రేటుతో విరుచుకుపడిన వీరూ 12 ఫోర్లు, 5 సిక్సర్లతో శతకగర్జన చేశాడు. దాంతో.. టీమిండియా ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. మరో విషయం.. భారత్ తరఫున టెస్టుల్లో తొలి ట్రిపుల్ సెంచరీ వీరుడిగా చరిత్ర సృష్టించిన వీరు.. పాక్‌పైనే ఆ రికార్డు సాధించాడు. ఇప్పుడు అతడి కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ సైతం జూనియర్ స్థాయిలో దుమ్మురేపుతున్నాడు. ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో ఈ చిచ్చరపిడుగు తండ్రిని తలపించే బ్యాటింగ్‌తో అలరిస్తున్నాడు.

# చరిత్ర సృష్టించిన భారత ఆర్చర్లు

### కాంపౌండ్ విభాగంలో తొలి స్వర్ణం..



ప్రపంచ వేదికలపై భారత ఆర్చర్లు మరోసారి సత్తా చాటారు. ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో కొన్నేళ్లుగా ఊరిస్తూ వస్తున్న పతకాన్ని సాధించారు. కాంపౌండ్ టీమ్ విభాగంలో దేశానికి తొలి పసిడి అందించింది పురుషుల బృందం. ఆదివారం జరిగిన ఫైనల్లో రిషభ్ యాదవ్, ప్రథమేశ్ ఫుగే, అమన్ సైనీల త్రయం ఫ్రాన్స్ ఆర్చర్లకు చెక్ పెట్టింది. హోరాహోరీగా సాగిన పోరులో 235-233తో మన జట్టు విజయం సాధించింది. ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో మహిళల టీమ్ మహిళల టీమ్ ఈసారి రజతంతో సరిపెట్టుకుంది. కాంపౌండ్ టీమ్ విభాగంలో నిరాశపరిచినా.. మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో రెండో స్థానంతో రజతం కొల్లగొట్టింది. అయితే.. పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగంలో రిషబ్, ప్రథమేశ్, అమన్ బృందం మాత్రం పసిడితో మెరిసింది. ఫైనల్ తొలి రౌండ్‌లో 57-59తో వెనకబడినప్పటికీ ఒత్తిడికి లోనవ్వలేదు ఈ ముగ్గురు. చెక్కుచెదరని ఏకాగ్రతను కనబరిచి రెండో రౌండ్‌లో వరుసగా ఆరుసార్లు పది పాయింట్లు సాధించారు. దాంతో, 176-176తో స్కోర్లు సమం అయ్యాయి. నిర్ణయాత్మక మూడో రౌండ్‌లో ఫ్రాన్స్ ఆర్చర్ 9 పాయింట్లకే పరిమితం కాగా.. ప్రథమేశ్ గురి తప్పకుండా పది పాయింట్లు సాధించడంతో చరిత్రాత్మక గోల్డ్ మెడల్ వచ్చింది. తద్వారా పోడియంపై సగర్వంగా నిలబడిన ఈ త్రయం మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది. 'ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ ఫైనల్లో ప్రథమేశ్ ఒక్కడే కాదు.. ముగ్గురు ఆర్చర్లు గొప్ప ప్రదర్శన చేశారు. ఏమాత్రం ఒత్తిడిలోకి లోనవ్వకుండా లక్ష్యాన్ని గురి చూసి బాణం వదిలారు. సమిష్టిగా రాణించడంతో భారత్ ఖాతాలో పసిడి పతకం చేరింది' అని చీఫ్ కాంపౌండ్ కోచ్ జివన్‌జ్యోత సింగ్ తేజా పీటీఐతో వెల్లడించాడు.





## బంపర్ ఆఫర్ కొట్టేసిన బింబిసారా బ్యూటీ ...

### ఆ హీరో సినిమాలో ఛాన్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో నటించిన సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది సంయుక్త మీనన్. ఇందులో సెకండ్ హీరోయిన్ గా కనిపించిన ఫస్ట్ మూవీ తోనే అందరి దృష్టిని ఆకర్షించింది. అందం అభినయం తో కటిపడేసింది ఈ వయ్యారి. దీంతో తెలుగులో ఈ అమ్ముడుకు వరస అవకాశాలు క్యూ కట్టాయి. బింబిసారా ,సార్, విరూపాక్ష వంటి చిత్రాలతో వరుసగా హిట్స్ అందుకుంది. దీంతో తక్కువ సమయం లోనే టాలీవుడ్ ఇండస్ట్రీలో గోల్డెన్ బ్యూటీగా ట్యాగ్ సొంతం చేసుకుంది. ఇప్పటివరకు ఈ అమ్మడు నటించిన చిత్రాలన్నీ సూపర్ హిట్ అయినప్పటికీ అవకాశం మాత్రం అంతగా రాలేదు. ప్రస్తుతం నిఖిల్, సిద్ధార్థ నటిస్తున్న స్వయంభు చిత్రంలో నటిస్తుంది. ఈ బ్యూటీ చేతిలో కేవలం ఒకే ఒక సినిమా మాత్రమే ఉంది. చిరంజీ, బాబి కాంబోలో రానున్న సినిమాలో కేరళ కుట్టి సంయుక్త మీనన్ నటిస్తున్నట్లు తెలుస్తుంది.

## స్టార్ హీరో సినిమాలని వెనక్కి నెట్టేసిన చిత్రం..

### ఓవర్సీస్‌లో అదిరిపోయే కలెక్షన్స్

ఎంత పెద్ద స్టారో హీరో సినిమా అయిన కథ బాగుంటేనే ఆ చిత్రానికి మంచి ఆదరణ లభిస్తుందని మరోసారి నిరూపితం అయింది. టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మరోసారి కంటెంట్ బేస్డ్ సినిమా విజయం సాధించింది. భారీ అంచనాలతో వచ్చిన స్టార్ హీరోల సినిమాలు బాక్సాఫీస్ దగ్గర నిరాశపరిచిన ఈ సమయంలో, చిన్న చిత్రంగా విడుదలైన 'లిటిల్ హార్ట్స్' అద్భుతమైన ఓపెనింగ్స్‌తో ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. అమెరికాలో విడుదలైన మొదటి రోజే లిటిల్ హార్ట్స్ చిత్రం $115K గ్రాస్ వసూళు నమోదు చేసింది. ఇది అదే రోజు విడుదలైన పలు స్టార్ సినిమాలపై స్పష్టమైన ఆధిపత్యాన్ని చూపించింది,.అమెరికా బాక్సాఫీస్ లెక్కల ప్రకారం చూస్తే.. లిటిల్ హార్ట్స్ సినిమా మొదటి రోజుకి 115K డాలర్లు రాబట్టింది. ఇది స్టార్ హీరో పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు ($114K), హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ లాంటి స్టార్ హీరోలతో వచ్చిన వార్ 2 ($104K) కలెక్షన్లను కూడా దాటడం విశేషం. ఇక అనుష్క శెట్టి నటించిన ఘాటీ మాత్రం మొదటి రోజుకి 27K డాలర్ల వద్దే ఆగిపోయింది. ఒక చిన్న సినిమా ఓపెనింగ్స్ ఈ స్థాయిలో సెన్సేషన్ సృష్టించడమంటే, ప్రేక్షకుల మద్దతు ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. వార్ 2, హరిహర వీరమల్లు, ఘాటీ వంటి భారీ సినిమాలు ఆశించిన రీతిలో రాణించలేకపోయాయి. కాని, లిటిల్ హార్ట్స్ వంటి చిన్న సినిమా పాజిటివ్ టాక్‌తో ముందుకు దూసుకెళ్లడం గమనార్హం. కంటెంట్ ఉన్న సినిమాలకి ప్రేక్షకులు ఆదరణ చూపుతారనేది మళ్లీ మళ్లీ నిరూపితమవుతోంది. ఒకవేళ కథ బలంగా ఉంటే, స్టార్ కాస్టింగ్ లేకపోయినా సినిమా కమర్షియల్ విజయం సాధించగలదని ఈ చిత్రం ఋజువు చేసింది. ప్రారంభం నుంచి లిమిటెడ్ స్క్రీన్స్‌లో రిలీజ్ అయినా, పాజిటివ్ టాక్‌తో పాటు మౌత్ పబ్లిసిటీ బాగా వర్కౌట్ కావడంతో, రెండో రోజు నుంచి స్క్రీన్ల సంఖ్యను పెంచారు. దీంతో కలెక్షన్ల పరంగా మరింత మెరుగైన ట్రెండ్‌ను ప్రదర్శిస్తోంది.ట్రేడ్ విశ్లేషకుల ప్రకారం, సినిమా వరల్డ్ వైడ్ బ్రేక్ ఈవెన్‌ను ఇప్పటికే పూర్తి చేసుకుని, క్లీన్ హిట్‌గా నిలిచింది. "ఓవర్సీస్ మార్కెట్‌లో దుమ్ము దులిపేస్తుంది. లిటిల్ హార్ట్స్ ఇచ్చిన ఫలితం వాస్తవికంగా ప్రేక్షకుల అభిరుచికి అద్దంపడుతోంది. మార్కెటింగ్ పెద్దగా లేకపోయినా, మంచి కథ, నెగెటివ్ టాక్ లేని సినిమాలు ఏ స్థాయిలో పని చేస్తాయో ఈ సినిమా ప్రూవ్ చేసింది.

## విడుదలకు ముందే భారీ లాభాలు తీసుకొస్తున్న మిరాయ్!



తేజా సజ్జా హీరోగా వస్తున్న మిరాయ్ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. విభిన్నమైన కథాంశంతో, అద్భుతమైన గ్రాఫిక్స్ ఈ సినిమాపై విపరీతమైన హైప్ క్రియేట్ చేసింది. ఇది కాస్త పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి భారీ లాభాలను తీసుకొస్తుంది. సినిమా విడుదలకు ముందే దాదాపు 20 కోట్ల వరకు లాభాలు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. దీంతో బాక్సాఫీసు వద్ద గత సినిమాల నష్టాల నుంచి పీపుల్ మీడియా ఫ్యాకర్టీ తేరుకుంటుందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.మిరాయ్ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రూ.60 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించింది. అద్భుత దృశ్యకావ్యంగా నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 12వ తేదీన థియేటర్లలో విడుదల కానుంది. కానీ ఇప్పటికే ఈ సినిమా నాన్ థియేట్రికల్ హక్కులు ( ఓటీటీ, శాటిలైట్ హక్కులు) కింద దాదాపు 45 కోట్లను సంపాదించిందని తెలుస్తోంది. దీంతో టేబుల్ ప్రాఫిట్ కింద రూ.20 కోట్లు అందుకుందని సమాచారం. ప్రస్తుతం బాక్సాఫీసు దగ్గర సినిమాల ఫలితాలను బట్టి చూస్తే ఇది చిన్న విజయం కాదనే చెప్పొచ్చు.ఎందుకంటే.. ఈ ఏడాదిలో వచ్చిన భారీ బడ్జెట్ చిత్రాలు.. తిరిగి డబ్బులను తీసుకురావడంలో విఫలమయ్యాయి. ముఖ్యంగా పాన్ ఇండియా ట్రెండ్‌ను ఫాలో అవుతూ, మార్కెట్‌ను మించి బడ్జెట్ పెట్టడం ద్వారా ఇలాంటి పొరపాట్లు జరుగుతున్నాయి. కానీ ఈ విషయంలో తేజా సజ్జా తెలివిగా వ్యవహరిస్తున్నారు. అనవసరపు హడావుడికి వెళ్లకుండా కంటెంట్ ప్రాధాన్యం ఉన్న సినిమాలను ఎంచుకుంటున్నాడు. అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కూడా కంటెంట్‌ను నమ్ముకునే మిరాయ్ సినిమాను తెరకెక్కించింది. పాన్ ఇండియా స్టోరీ అని భారీ బడ్జెట్, స్టార్ క్యాస్టింగ్ జోలికి వెళ్లకుండా రూ.60 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించింది. అదనపు హడావుడితో కాకుండా కంటెంట్‌ను నమ్ముకుని ఈ సినిమాను నిర్మించింది. ఇటీవల విడుదలైన మిరాయ్ ట్రైలర్ దాన్ని నిరూపిస్తోంది

## బ్రహ్మారాక్షస పట్టాలెక్కేదెప్పుడో?



పానిండియా స్టార్ ప్రభాస్ సినిమాల లైనప్ మామూలుగా లేదు. ఇప్పటికే ది రాజాసాబ్, ఫౌజీ సినిమాలు సెట్స్‌పై ఉన్నాయి. స్పిరిట్, కల్కి 2, సలార్– శౌర్యాంగపర్వం చిత్రాలు వెయిటింగ్‌లో ఉన్నాయి. ఇవిగాక నేనూ ఉన్నానంటున్నారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. అసలు ఇంత బిజీగా ఉన్న ప్రభాస్.. ప్రశాంత్‌వర్మకు ఓకే చెప్తాడా? అనేది ఫిల్మ్ వర్గాల్లో నెలకొని ఉన్న ప్రశ్న.అయితే.. తాను ప్రభాస్‌తో సినిమా చేయబోతున్నట్టు రీసెంట్‌గా క్లారిటీ ఇచ్చారు ప్రశాంత్‌వర్మ. 'ప్రస్తుతానికి ఆ ప్రాజెక్ట్‌పై పెద్దగా మాట్లాడేదేంలేదు. మేమైతే షూటింగ్ కోసం రెడీగా ఉన్నాం. హీరోగారి డేట్స్ దొరకడమే తరువాయి. పట్టాలెక్కించేస్తాం' అన్నారాయన. ఇప్పటికే ఆయన 'బ్రహ్మారాక్షస' అనే కథను ప్రభాస్‌కి వినిపించినట్టు విశ్వసనీయ సమాచారం. ప్రభాస్ కూడా ఓకే చెప్పారట. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభాస్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడానికి రెండుమూడేళ్లు పట్టడం ఖాయం. ఈ లోపు 'జై హనుమాన్' ఎలాగూ ఉంది. ప్రశాంత్‌వర్మ యూనివర్స్‌లో దటీజ్ మహాలక్ష్మి, అధీరా, మహాకాళి లైన్లో ఉన్నాయి. వీటి తర్వాత 'బ్రహ్మారాక్షస' మొదలవుతుందన్నమాట.



## ఈ జర్నీ ఎంతో దారుణం..

బిజీ అయితే.. టైమ్ దొరకదు. టైమ్ దొరుకుతుందంటే బిజీ కాదని అర్థం. బిజీ కాకపోతే ఓ బాధ. బిజీ అయి టైమ్ దొరక్కపోతే ఓ బాధ. అదే డెస్టినీ. భగవంతుడు ఏదీ పూర్తిగా ఇవ్వడు. రష్మిక మందన్నా ఇటీవల పెట్టిన పోస్ట్ ఈ వేదాంతాన్ని గుర్తుచేసేలా ఉంది. 'తెల్లవారు జామున 3గంటల 50 నిమిషాలకు ఫ్లైట్. అంటే.. రెండు గంటల ముందే ఎయిర్‌పోర్ట్‌లో ఉండాలి. ఈ జర్నీ ఎంతో దారుణం.. అసలు ఇది పగలో రాత్రో అర్థం కావడంలేదు.' అంటూ ఫ్లైట్ విండో లోంచి తీసిన ఓ ఫొటోను షేర్ చేశారు రష్మిక. అయితే.. ఈ ప్రయాణం ఎక్కడికి? ఎన్ని గంటలు? అనే విషయాన్ని మాత్రం రివీల్ చేయలేదు. ఈ పోస్ట్ చూసినవారంతా.. 'లైమ్‌లైట్లో ఉన్నంతవరకే ఈ అదృష్టం.. ఆ తర్వాత

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492